నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




సంపుటి : 13 సంచిక : 125 రంగారెడ్డి | బుధవారం 02 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 02-09-2026 | September | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To:Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada

# హైడ్రా చీఫ్ అప్పీల్

## హైకోర్టులో రంగనాథ్‌కు ఊరట

- తొలగింపు ఆదేశాలపై డివిజన్ బెంచ్ స్టే
- సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ అప్పీల్
- తాత్కాలికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు ఎత్తివేసిన కోర్టు



హైదరాబాద్, నిర్భయవార్త ప్రతినిధి : హైడ్రా కమిషనర్ పదవి నుంచి సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ మంగళవారం స్టే విధించింది. సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ దాఖలు చేసిన అప్పీల్‌ను విచారించిన డివిజన్ బెంచ్ తదుపరి విచారణ వరకు ఆ తీర్పు అమలును నిలిపి వేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రంగనాథ్‌కు తాత్కాలిక ఊరట లభించింది.

### లోతుకుంట భూమి విషయంలో..

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా లోతుకుంట గ్రామంలోని సర్వే నంబర్లు 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలో గత నెల 17న హైడ్రా చేపట్టిన కూల్చివేతలను సవాల్ చేస్తూ శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను విచారించిన సింగిల్ బెంచ్.. కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘిస్తున్న అధికారిగా రంగనాథ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించి మరో అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ రంగనాథ్ మంగళవారం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. వాదనలు విన్న ధర్మాసనం సింగిల్ బెంచ్ తీర్పు అమలును తాత్కాలికంగా నిలిపివేస్తూ స్టే మంజూరు చేసింది. తదుపరి విచారణ వరకు రంగనాథ్ హైడ్రా కమిషనర్‌గా కొనసాగేందుకు మార్గం సుగమమైంది.

## కేంద్రం తన హామీని నిలబెట్టుకుంది..

### విద్యార్థులపై ఎలాంటి చర్యలు ఉండవు: జేపీ నడ్డా..



న్యూఢిల్లీ,నిర్భయవార్త ప్రతినిధి : ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేసే ప్రక్రియను వేగవంతం చేసినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ ఏడాది జులై నెలలో ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకుందని నడ్డా పేర్కొన్నారు.కేంద్రంతో పాటు బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి, విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసే ప్రక్రియను వేగవంతం చేసినట్లు నడ్డా తెలిపారు. విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. దేశ యువత, విద్యార్థుల అభ్యున్నతి, వికాసమే ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని నడ్డా చెప్పుకొచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించాల్సిన ర్యాలీని విరమించుకుంటున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించడాన్నీ కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్వాగతించారు. కాగా, నీట్ పేపర్ లీక్‌తో దేశ రాజధాని సహా పలు రాష్ట్రాల్లో సీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. కొన్ని వారాలపాటు ఆందోళనలు కొనసాగగా.. జులై 20 నుంచి 25 మధ్య పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీంతో ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో నిరసనకారులపై కేసులు నమోదయ్యాయి. అయితే, విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను సుప్రీంకోర్టు నేడు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సీజేపీ నిరసనలకు సంబంధించిన కేసులను ఉపసంహరించుకుంటామని, కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమన్న కేంద్ర ప్రభుత్వ హామీ మేరకు సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.

## ఎంపీ ల్యాడ్స్ నిధులపై అసత్య ప్రచారం చేయొద్దు: బండి సంజయ్




కరీంనగర్, నిర్భయవార్త ప్రతినిధి :ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించుకోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా.. అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా బండి సంజయ్ మీడియాకు వివరించారు.‘కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి.

# కాంగ్రెస్‌లో.. పంచాయితీ!

## హస్తినలో కొండా, కోమటిరెడ్డి



- ఢిల్లీలోనే సీఎం రేవంత్ రెడ్డి
- సురేఖకు కేసీ వేణుగోపాల్ పిలుపు
- ఆమె వెంటే వెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- కాంగ్రెస్‌లో ఆసక్తికర పరిణామాలు



తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా కొనసాగుతున్న రాజకీయ పరిణామాలు తాజాగా ఢిల్లీకి చేరాయి. మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ అధిష్ఠానం హుటాహుటిన ఢిల్లీకి పిలిపించడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నుంచి పిలుపు రావడంతో ఆమె మంగళవారం ఢిల్లీకి బయలుదేరారు. ఆమెతో పాటు మంత్రి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా ఢిల్లీకి వెళ్లినట్లు సమాచారం.

### వ్యాఖ్యలపై వివరణ కోరే అవకాశం

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. ఈ నేపథ్యంలోనే ఆమెను అధిష్ఠానం పిలిపించిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. తాజా పరిణామాలపై వివరణతో పాటు పార్టీ క్రమశిక్షణ, నేతల మధ్య సమన్వయం, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కేసీ వేణుగోపాల్ చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.

### రేవంత్ ఢిల్లీలోనే.. పెరిగిన ప్రాధాన్యం

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ఢిల్లీలో ఉండటం ఈ పరిణామాలకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. రాష్ట్రానికి చెందిన పలువురు కీలక నేతలు కూడా ప్రస్తుతం హస్తినలోనే ఉండటంతో తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించిన అంశాలపై అధిష్ఠానం స్థాయిలో కీలక చర్చలు జరిగే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### ఏం తేలనుంది?

సురేఖను అధిష్ఠానం ఏ ఉద్దేశంతో పిలిపించిందన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవలి వ్యాఖ్యలపై వివరణ కోసమా, పార్టీ అంతర్గత విభేదాల పరిష్కారానికా, లేక రాష్ట్ర కాంగ్రెస్‌కు సంబంధించిన రాజకీయ అంశాలపై చర్చించేందుకా అన్నది కేసీ వేణుగోపాల్‌తో భేటీ స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## ప్రతిష్టాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్



హైదరాబాద్ :డిసెంబర్ 7 నుంచి జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్––2026ను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. సమ్మిట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలనీ, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ప్రజా ప్రభుత్వం నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్––2026 ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప కమిటీ సభ్యులు, ఐటీ––పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు హాజరయ్యారు. ?సమ్మిట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని భట్టి సూచించారు. రోజువారీగా ఏర్పాట్ల పురోగతిని పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని ఈ వార్‌రూమ్ ద్వారా మరింత బలోపేతం చేయాలని అన్నారు. సమ్మిట్ నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్ల కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి కమిటీకి సీనియర్ అధికారులను బాధ్యులుగా నియమించాలని ఆదేశించారు. సలహా కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఆహ్వాన కమిటీ, హాస్పిటాలిటీ కమిటీ, ప్రోగ్రామ్ డిజైనింగ్ కమిటీ, మీడియా––కాంటాక్ట్ అండ్ కమ్యూనికేషన్ కమిటీ, ఎంఓయూ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేసి, సీనియర్ ఐఏఎస్ అధికారులకు బాధ్యతలను అప్పగించాలని సూచించారు.

నిర్భయవార్త

సంపాదకీయం

బుధవారం 02 సెప్టెంబర్ 2026

# మృత్యు ముఖంలో పెట్టుబడిదారీ వ్యవస్థ

ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థ బలహీనపడుతూ క్షీణిస్తున్న లక్షణాలు మనకి బాగా ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఇటువంటి లక్షణాలు వ్యక్తం కావడం అనేది మాత్రం ఇదే మొదటిసారి కాదు. ఇంతకు ముందు ఇటువంటి లక్షణాలే 1914–1945 మధ్య కాలంలో కూడా కనిపించాయి. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ జబ్బుపడ్డ వ్యవస్థ అని లెనిన్ చేసిన రోగ నిర్ధారణ సరైనదే అని అప్పుడే రుజువైంది. అప్పటికి, ఇప్పటికి తేడా అంతా వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు అది స్పందించిన తీరులోనే ఉంది. అప్పుడు ఈ వ్యవస్థ ఒక పథకం ప్రకారం కాని, లేక అనివార్యం అయినందువలన కాని తనను తాను "సంస్కరించుకోవడానికి" సిద్ధపడింది. కనీసం మూడు ప్రత్యేక విధాలుగా ఈ సంస్కరణ జరిగింది. మొదటిది– రాజకీయంగా వలస విధానానికి తెర దించడం. విన్‌స్టన్ చర్చిల్ వంటి బూర్జువా నాయకులు అప్పుడు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. వలసల మీద పెత్తనాన్ని వదులుకున్నా, మూడవ ప్రపంచ దేశాల వనరుల మీద పెత్తనాన్ని వేరే పద్ధతుల ద్వారా చెలాయించడానికి పూనుకున్నారు. రెండవది– ప్రపంచంలోని ప్రధాన పెట్టుబడిదారీ దేశాలలో ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని ఒక వ్యక్తి–ఒక ఓటు సూత్రం ప్రాతిపదికన అమలు చేయడం, మూడవది– నిరుద్యోగాన్ని తగ్గించి తద్వారా స్థూల డిమాండ్‌ను పెంచడానికి వీలుగా రాజ్యం జోక్యం చేసుకోవడం. యూరప్‌లో ఈ చర్యల వలన భారీగా సంక్షేమ ఖర్చు పెరిగింది. అదే అమెరికాలోనైతే భారీ సైనిక వ్యయం ద్వారా రాజ్యం జోక్యం చేసుకుంది. మొదటి రెండు చర్యల వలన పెట్టుబడిదారీ వ్యవస్థ కు ఎటువంటి సవాలైనా ఎదురైతే దానిని తట్టుకుని నిలబడడానికి మూడవ చర్య తోడ్పడింది. ఆ విధంగా ఇది ముఖ్యమైనది. పెట్టుబడిదారీ వ్యవస్థ "మానవీయ"మైనదని, "ప్రజాస్వామ్యయుత"మైనదని, దాదాపు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పన చేయగలుగుతుందని ఆ విధంగా అది సోషలిజం కన్నా ఉన్నతమైనదని చెప్పుకుని తన ఉనికికి ఎదురైన సవాలుని తట్టుకుని సంక్షోభాన్ని అధిగమించగలిగింది. తన కొత్త రూపాన్ని చూపి ప్రపంచాన్ని చాలా బలంగా నమ్మించగలిగింది కూడా. మరోవైపు మూడవ ప్రపంచ దేశాలలోని వివిధ అధినేతలను హత్యలు గావించడం, మరికొన్ని దేశాల్లో కుట్రల ద్వారా ప్రభుత్వాలను కూలదోసి తన తొత్తులను గద్దెనెక్కించడం వంటివి కొనసాగిస్తూనేవచ్చింది. మొస్సాదెహ్ నుంచి ఆర్బెంజ్ వరకు, లుముంబా నుండి అలెండీ వరకు జరిగినవి మాత్రమే కాదు, కొరియాలో, వియత్నాంలో అది సాగించిన దురాగతాల గురించి వేరే చెప్పనక్కర్లేదు. తన ఉనికికి సంక్షోభం నుంచి ఎదురైన సవాలును తట్టుకోడానికి అది ప్రారంభించిన పెట్టుబడిదారీ దశను "పెట్టుబడిదారీ విధానపు స్వర్ణయుగం" అని పిలుస్తారు. అంతకు మునుపటి పరిస్థితితో పోల్చితే ఇది సాపేక్షంగా కొత్తది, విభిన్నమైనది. అప్పటికి, ఇప్పటికి తేడా ఏమంటే అప్పటి మాదిరిగా మార్కెట్లో డిమాండ్ ను పెంచడం కోసం ప్రభుత్వం జోక్యం చేసుకోవడం ఇప్పుడు ఇంకెంత మాత్రమూ సాధ్యం కాదు. ఇప్పుడు డిమాండ్ ను పెంచడానికి వీలుగా ప్రభుత్వ వ్యయం పెంచాలంటే అందుకు ద్రవ్యలోటును పెంచడం కాని, లేదా ధనవంతుల మీద పన్నులను పెంచడం కాని చేయాలి. కార్మికవర్గం మీద పన్నులు పెంచడం వలన డిమాండ్ పెరుగుదల ఉండదు. వారి ఆదాయాలను కార్మికులు ఎటుతిరిగీ ఖర్చు చేసేస్తారు. పన్నులను వారిమీద అదనంగా వేస్తే అప్పుడు ఆ ఖర్చు తగ్గిపోయి డిమాండ్ తగ్గిపోతుంది. అప్పుడు ప్రభుత్వానికి వచ్చిన పన్ను రాబడిని ఖర్చు చేసినా మొత్తంగా చూసినప్పుడు డిమాండ్ పెరుగుదల ఏమీ ఉండదు. దానిని పక్కన పెడితే మిగిలినవి రెండు– ద్రవ్యలోటును పెంచడం లేదా ధనవంతుల మీద పన్ను పెంచడం. ఈ రెండు చర్యలనీ ద్రవ్య పెట్టుబడి అంగీకరించదు (ఎందుకంటే అత్యంత సంపన్నుల దగ్గరే ద్రవ్య పెట్టుబడి ఎక్కువగా పోగుబడి వుంటుంది). పైగా ఇప్పుడు ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయ స్వభావాన్ని సంతరించుకుంది. కానీ, రాజ్యాలు ఇంకా జాతి రాజ్యాలుగానే కొనసాగుతున్నాయి. పెట్టుబడి దేశం నుండి పలాయనం చిత్తగించకుండా ఉండాలంటే అప్పుడు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడే నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుంది. అందుచేత ఇప్పుడు నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక మాంద్యం రూపంలో ఎదుర్కొంటున్న సంక్షోభం నుంచి ఉపశమనం పొందే దారి ఏదీ లేదు. ఆదాయాల్లో విపరీతంగా పెరిగిపోయిన అసమానతలే ఈ మాంద్యానికి దారి తీశాయి. దాంతో నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ ముందు దారి మూసుకుపోయింది. వ్యవస్థ ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయినప్పటికీ, దానిని అధిగమించడానికి అది ఏమీ చేయలేని స్థితిలో ఉంది. ఇన్నాళ్లూ పెట్టుబడిదారీ వ్యవస్థ తనను గురించి తాను చిత్రించిన రూపానికి పూర్తి విరుద్ధమైన లక్షణాలను మనం ఇప్పుడు చూస్తున్నాం. అన్నింటికన్నా ముందు ప్రజాస్వామ్యం మీద వాస్తవమైన దాడి జరుగుతోంది. పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా ఇప్పుడు పచ్చి నయా ఫాసిస్టు ప్రభుత్వాలైనా నడుస్తున్నాయి, లేదా ప్రజాస్వామ్యం ముసుగులో నిరంకుశ ప్రభుత్వాలైనా నడుస్తున్నాయి. అన్ని చోట్లా ప్రభుత్వ విధానాల మీద ప్రజాగ్రహం పెరుగుతోంది. దానిని వ్యక్తం చేసినవారిమీద మెకార్థీయిస్టు పద్ధతుల్లో వేధింపులు కొనసాగుతున్నాయి. ఇప్పుడు ప్రపంచంలో అత్యధిక పెట్టుబడిదారీ దేశాల్లో పాలస్తీనా మీద ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతి హననం పట్ల తీవ్ర వ్యతిరేకత నెలకొంది. కాని ఆ దేశాల ప్రభుత్వాలు మాత్రం ఇజ్రాయిల్ కి మద్దతుగా వ్యవహరిస్తున్నాయి (ఒక్క స్పెయిన్ మాత్రమే మినహాయింపు). అంతేగాక, పాలస్తీనా మద్దతుదారులకు అనుకూలంగా ప్రజలు చేపట్టిన కార్యక్రమాలను తీవ్రంగా అణచివేస్తున్నాయి. తన దేశం ఎటువంటి అసమ్మతినైనా అనుమతిస్తుందని గర్వంగా చెప్పుకునే బ్రిటన్ ఇప్పుడు పాలస్తీనాకు అనుకూలంగా ప్రసంగించిన విద్యార్థులను "ఉగ్రవాదులు" అంటూ వారిపై కేసులు పెట్టి విచారిస్తోంది. అలా కేసులను ఎదుర్కొంటున్న వారిలో మెజారిటీ మీద ఇంతవరకూ ఛార్జిషీట్లు కూడా దాఖలు చేయలేదు. ఇటువంటి పరిస్థితే తక్కిన సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో కూడా ఉంది. జర్మనీ వంటి దేశాల్లో పాలస్తీనాకు సంఘీభావంగా కార్యక్రమాలు చేయడాన్ని నిషేధించారు. జాతి హననాన్ని సైతం బలపరచడమే కాకుండా, రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో ముందెన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ హక్కులను పరిరక్షిస్తుందని చెప్పుకుంటూ వచ్చినదంతా బూటకం అని తేలిపోయింది.

# హిమాలయ 'సునామీ'కి బాధ్యులెవరు?



నేపాల్‌ను విషాదసీమగా మార్చివేసిన మహా విపత్తు అది. హిమాలయ మంచుకొండల మీది హిమనీనదాలు కరిగిపోయాయి. నిటారుకొండలు తమ గర్వాన్ని వీడి కూలిపోయాయి. నదులు వరద జలాలతో పోటెత్తాయి. అనూహ్యమైన జలప్రళయమది. హిమాలయ ప్రాంతాల్లో సంభవించిన ఈ విపత్తు అసాధారణమైనది. విపత్తు దృశ్యాలు భయానకమైనవి. దశాబ్దానికి పైగా అంతర్జాతీయ వాతావరణ విధానంపై కృషి చేస్తున్న నేపాలీ పౌరుడిగా నేను ఈ విపత్తుకు తీవ్రంగా కలత చెందాను. ఆవేదనకు మించిన ఆగ్రహం నన్ను కుదిపివేసింది. ఇటువంటి ప్రళయం విరుచుకుపడవచ్చని శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాలుగా హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రపంచ వాతావరణ కార్యాచరణలో జాప్యమే ఈ జల ప్రళయం, సందేహం లేదు. హరితగృహ వాయు ఉద్గారాలను తగ్గించి, భూ తాపాన్ని పరిమితం చేయడమే లక్ష్యంగా ఉన్న ప్రపంచ వాతావరణ కార్యాచరణ విషయంలో ప్రపంచ దేశాల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ఇటువంటి ప్రళయం జరిగేదేనా? ఆగస్టు 26న మంచు, నీరు, బండరాళ్లు, బురదతో కూడిన రాకాసివరద అశేష ప్రజలను కకావికలు చేసింది. లక్షలాది గృహాలను ధ్వంసం చేసింది, మార్కెట్లు, వంతెనలు, రోడ్లు రూపు లేకుండా పోయాయి. ఇటు నేపాల్‌లోను, అటు టిబెట్‌లోను విద్యుదుత్పాదన కేంద్రాలు కొట్టుకుపోయాయి. వందలాదిమంది మరణించగా, జాడలేకుండా పోయినవారు వేల సంఖ్యలో ఉన్నారు. అనూహ్య వేగంతో ఈ విధ్వంసం చోటుచేసుకున్నది. పర్వతాగ్రాలపై మొదలైన విపత్తు క్షణాల్లో దిగువ ప్రాంతాలకు వ్యాపించింది. ఈ విపత్తు ఒక వాస్తవాన్ని స్పష్టంగా ఎత్తిచూపింది: నేపాల్‌కు మరింత బలమైన ముందస్తు విపత్తు హెచ్చరిక వ్యవస్థలు, హిమనీనదాల, అస్థిర కొండవాలుల నిరంతర మెరుగైన పర్యవేక్షణ, నేపాల్, టిబెట్‌లో ఉమ్మడి జలవనరుల పరివాహక ప్రాంతాలు ఉన్నందున ఈ రెండు హిమాలయ ప్రాంతాల మధ్య సరిహద్దు సమాచార మార్పిడి, మరీ ముఖ్యంగా ప్రాకృతిక విపత్తుల సన్నద్ధతలో భారీ ఎత్తున నిధుల వినియోగం అత్యవసరం. నేపాల్‌లో మెరుపు వరదలు ఒక మౌలిక వాస్తవాన్ని బహిర్గతం చేశాయి: సమస్య ముందస్తు హెచ్చరికల వ్యవస్థ లేకపోవడం కాదు; వాతావరణ సంక్షోభం సృష్టిస్తున్న ప్రమాదాలు ఊహింపదగిన విపత్తులకు భిన్నంగా ఉంటున్నాయి; ఫలితంగా హెచ్చరిక వ్యవస్థలు ఆ అనూహ్య అపాయాల సంభవాన్ని గ్రహించలేకపోతున్నాయి. హిమాలయ పర్వతాల పరివేష్టిత భోటేకోశి నదీ తీరస్థ ప్రాంతాలను ముంచివేసిన వరదే అందుకొక ఉదాహరణ. బురద, కొండరాళ్లతో ఆకస్మికంగా విరుచుకుపడిన ఆ వరద నది ఎగువ ప్రాంతంలోని హైడ్రాలాజికల్ కేంద్రాలను, నీటి మట్టాల పెరుగుదలను కనిపెట్టి హెచ్చరికలను జారీ చేయక ముందే ధ్వంసం చేసింది. క్రమంగా పెరిగే నీటి మట్టాల పెరుగుదలను కనిపెట్టేందుకు ఆ హెచ్చరిక వ్యవస్థను రూపొందించారు. అయితే ఆగస్టు 26న సంభవించిన రాకాసి వరద ఆ హెచ్చరిక వ్యవస్థను ముందుగానే సమూలంగా ధ్వంసం చేసింది. ఇదెలా జరిగింది? శాస్త్రవేత్తల ప్రాథమిక అంచనా ప్రకారం, ఒక భారీ హిమనీనదం కూలిపోవడం కారణంగా ఇది సంభవించింది. పర్వతాల పై భాగంలో జరిగిన ఈ సంఘటన దిగువ ప్రాంతాలలో హింసాత్మక వరదకు దారితీసింది. ఈ క్రమం తీరుతెన్నులను కచ్చితంగా నిర్ధారించేందుకు ఇంకా అధ్యయనాలు జరుగుతున్నాయి. అంతిమంగా శాస్త్రవేత్తల వివరణ ఏమైనప్పటికీ వేడెక్కిన పర్వత ప్రాంతాలలో ప్రమాదాలు ఎంత త్వరితంగా మహావిపత్తులుగా పరిణమిస్తాయనేదానికి ఈ సంఘటనే తిరుగులేని నిదర్శనం. స్పష్టంగా చెప్పాలంటే విపత్తును పసిగట్టడానికి ఉద్దేశించిన సాధనాలే దానివల్ల పనిచేయకుండా పోయాయి. ఈ వ్యత్యాసం చాలా ముఖ్యమైనది. గతంలో సంభవించిన వరదలను బట్టి రూపొందించిన ముందస్తు హెచ్చరిక వ్యవస్థ భవిష్యత్తులో తీవ్రమైన విపత్తుల ముందు సరిపోనిదిగా మిగలవచ్చు. అంతమాత్రాన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు నిష్ప్రయోజనకరమని భావించనవసరం లేదు. అయితే వాటి పరిమితులను మనం గుర్తించాలి, అంగీకరించాలి. వాతావరణ అనుసరణ (వాతావరణ మార్పు, దాని ప్రభావాలకు అనుగుణంగా నష్టాన్ని తగ్గించడానికి సర్దుబాటు చేసుకునే ప్రక్రియ)కూ పరిమితులున్నాయి. మౌలిక సదుపాయాలను పటిష్ఠపరచుకోవడం, విపత్తుల నెదుర్కొనే సంసిద్ధతను మెరుగుపరచుకోవడం, జీవనాధారాలకు రక్షణ కల్పించడం మొదలైన చర్యలతో అటువంటి సర్దుబాటుకు నేపాల్ చాలా సంవత్సరాలుగా చురుగ్గా ప్రయత్నిస్తున్నది. అయితే వాతావరణ సంక్షోభానికి చారిత్రకంగా బాధ్యత ఉన్న పారిశ్రామిక సంపన్న దేశాల నుంచి నేపాల్‌కు తగు ఆర్థిక సహాయం లభించనే లేదు. తీవ్రమవుతున్న వాతావరణ ప్రమాదాలను, వినాశనకర వరదలను ఎదుర్కోవడానికి నేపాల్‌కు అంతర్జాతీయ సహకారం అత్యవసరం. ఎందుకంటే హిమాలయ ప్రాంతాల్లో సంభవించే ప్రాకృతిక విపత్తులు జాతీయ సరిహద్దులకు ఆవల ఉద్భవిస్తాయి. కనుక సంబంధిత దేశాల మధ్య సహకారం, సకాలంలో సమాచార మార్పిడి ఉండి తీరాలి. నేపాల్ ప్రాంతపు హిమాలయాలు వేగంగా మారుతున్నాయి. హిమనీనదాలు క్షీణిస్తున్నాయి. భూతాపం హిమాలయ ప్రాంతాల సుస్థిర పరిస్థితులను వేగంగా మార్చివేస్తోంది. ఈ సంక్షోభ పరిస్థితులు మరింత తీవ్రతరం కాకుండా నివారించడమే మొదటిపని కావాలి. దశాబ్దాలుగా శిలాజ ఇంధనాల ఆధారిత అభివృద్ధి నుంచి అత్యధికంగా ప్రయోజనం పొందిన పారిశ్రామిక సంపన్న దేశాలకు కాలుష్యకారక ఉద్గారాలను వేగంగా తగ్గించాల్సిన ప్రత్యేక బాధ్యత ఉంది. ఆ బాధ్యతను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతికతలు ఆ దేశాలకు సమృద్ధిగా ఉన్నాయి. శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధనాల వినియోగానికి వారు శీఘ్రగతిన పరివర్తన చెంది తీరాలి. అది ఆవశ్యక న్యాయబద్ధమైన మార్పు. అయితే సంపన్న దేశాలు ఈ మార్పు దిశగా ప్రస్థానించడం లేదన్నది ఒక కఠోర సత్యం. ఈ పరిస్థితుల నుంచి నేపాల్ విధిగా ఒక పాఠాన్ని నేర్చుకోవాలి. వాతావరణ సంక్షోభానికి కారణమైన ఆర్థికాభివృద్ధి నమూనాను అనుకరించకూడదు. ఒక భిన్నమైన వ్యవస్థను నిర్మించుకునే అవకాశం తనకు ఉందనే వాస్తవాన్ని నేపాల్ గుర్తించాలి. అభివృద్ధి పేరిట సహజ వనరులను విచక్షణారహితంగా ఉపయోగించుకోవడాన్ని నిలిపివేయాలి. ప్రజల జీవనోపాధులకు, పర్యావరణ సమతౌల్యతకు ప్రాధాన్యమిచ్చే ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవాలి. కాలుష్యకారక వాయువుల ఉద్గారాలలో నేపాల్ వాటా చారిత్రకంగా ఎప్పుడూ 0.1శాతం కంటే తక్కువగా ఉంటోంది. నేపాల్ తలసరి ఉద్గారాలు ప్రపంచంలోనే చాలా తక్కువ. అయినప్పటికీ తాను సృష్టించని, వాతావరణ సంక్షోభానికి ఆ దేశం అధిక మూల్యం చెల్లిస్తోంది. ఇది న్యాయవిరుద్ధం కాదూ? వాతావరణ మార్పుల ఫలితంగా అనివార్యమవుతున్న ఆర్థిక, ఆర్థికేతర నష్టాల నుంచి కోలుకునేందుకు నష్టపరిహార సహాయం అందించాలని నేపాల్, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు పదే పదే డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవలి మహా విపత్తులో సంభవించిన అపార నష్టం నుంచి కోలుకునేందుకు విధిగా పెద్ద ఎత్తున రుణాలు తీసుకోవల్సిన పరిస్థితిని నేపాల్‌కు కల్పించకూడదు. ఇది సంపన్న దేశాల నైతిక బాధ్యత. ఇప్పటికే అందిస్తున్న అధికారిక అభివృద్ధి సహాయానికి అదనంగా నష్ట పరిహార ఆర్థిక సహాయాన్ని అందించాలి.

ఈ అదనపు సహాయాన్ని సులభ షరతులపై ఉదారపూర్వకంగా అందించాలి. సంపన్న దేశాలు ప్రస్తుతం తాము ఉపయోగించుకుంటున్న శిలాజ ఇంధనాల పరిమాణాన్ని యథావిధిగా కొనసాగించిన పక్షంలో, నేపాల్ మొదలైన అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవి ఎంత అధిక మొత్తంలో నష్టపరిహార సహాయం అందించినా ప్రయోజనం ఉండదు. భోటేకోశి నదీ తీరస్థ ప్రాంతాల ప్రజలు హిమాలయాలు వేడెక్కడాన్ని కోరుకోలేదు. మంచు పర్వతాలు వేడెక్కడానికి కారణమైన శిలాజ ఇంధన ఆర్థిక వ్యవస్థను కూడా వారు ఎంచుకోలేదు. తగినంత ఆర్థిక, సాంకేతికత మద్దతు లభిస్తే పరిస్థితులకు అనుగుణంగా మారి తమ భవిష్యత్తును పదిలం చేసుకోగలరు. హిమనీనదాలు కరగడాన్ని నివారించలేకపోయినప్పటికీ అంతర్జాతీయ ఆర్థిక సహకారం, అధునాతన సాంకేతికతల తోడ్పాటుతో వాతావరణ విపత్తులను ముందుగానే పసిగట్టి, వాటి నుంచి సురక్షితంగా లేదా సాధ్యమైనంత తక్కువ నష్టంతో బయటపడగలరు. నష్టపరిహార సహాయం అనేది దాతృత్వం కాదు. తాము చేయని అపరాధానికి భారీగా నష్టపోయిన ప్రజల శ్రేయస్సు పట్ల తమ బాధ్యతగా ఆ సహాయాన్ని పారిశ్రామిక సంపన్న దేశాలు అందించాలి.

# డేటా సెంటర్లకు తాగు నీరు.. ఒక దుష్ప్రచారమే!

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రేపు పాయకరావుపేట వద్ద జరుగనున్న 'జలహారతి' కార్యక్రమం ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు విడుదల కాబోతున్నాయి. ఒకవైపు ఇలా పోలవరం కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర ముఖద్వారాన్ని తాకుతుంటే, మరోవైపు ఈ నీటి వినియోగంపై దుష్ప్రచారం పెచ్చుమీరుతున్నది. విశాఖపట్నం నగరవాసులకు దక్కాల్సిన మంచినీటిని ఈ డేటా సెంటర్లు తోడేస్తాయన్నది ఈ ప్రచారం సారాంశం. కానీ, శాసనసభలో ఐటీ మంత్రి లోకేశ్ ఇచ్చిన అధికారిక సమాచారం, క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ డేటాను పరిశీలిస్తే, ఈ ఆరోపణలన్నీ అవగాహనా రాహిత్యంతో చేస్తున్నవేనని తెలుస్తుంది. విశాఖపట్నం ప్రజల మున్సిపల్ తాగునీటి సరఫరా వ్యవస్థకు, గూగుల్ డేటా సెంటర్లకు వాడే నీటి వ్యవస్థకు సాంకేతికంగా కానీ, భౌతికంగా కానీ ఎటువంటి సంబంధమూ లేదు. విశాఖపట్నం ప్రజల కోసం కేటాయించిన ఒక్క నీటి చుక్కను కూడా ప్రభుత్వం పరిశ్రమలకు మళ్లించదని మంత్రి లోకేశ్ స్పష్టంగా చెప్పారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విశాఖ--అనకాపల్లి ప్రాంతానికి అందుబాటులోకి వచ్చే మొత్తం 23.44 టీఎంసీల నీటిలో ప్రభుత్వం స్పష్టమైన విభజనను అమలు చేస్తోంది. గ్రేటర్ విశాఖపట్నం, పరిసర పట్టణాల్లోని ఇళ్లకు వాడే మంచినీటి కోసం 12 టీఎంసీలు కేటాయించారు. ఈ కోటాను పరిశ్రమలకు మళ్లించడం అసాధ్యం. గూగుల్, అదానీ ఏఐ డేటా సెంటర్ల పూర్తి స్థాయి వినియోగానికి కావలసిన 3.5 టీఎంసీలతో కలుపుకుని, పారిశ్రామిక కారిడార్ అవసరాలకు మొత్తం 4 టీఎంసీలు కేటాయించారు. ఇక అనకాపల్లి, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 7.44 టీఎంసీలు కేటాయించారు. ప్రతి ఏడాది సముద్రంలో వృథాగా కలిసే 3,000 టీఎంసీల గోదావరి జలాల నుంచే ఈ కేటాయింపులు జరుగుతున్నాయి తప్ప, రైతుల కోసమో, నగరవాసుల కోసమో కేటాయించిన నీటిని ప్రభుత్వం తీసుకోవడం లేదు. గూగుల్, అదానీ డేటా సెంటర్ల కోసం నిర్మించే నీటి లైన్లు మిగతా వాటితో పూర్తిగా సంబంధం లేకుండా ఉంటాయి. నగరంలో ఇళ్ళకు నీటిని సరఫరా చేసే మున్సిపల్ పైప్‌లైన్లకు, గ్రేటర్ జీవీఎంసీ నిర్వహించే తాగునీటి రిజర్వాయర్లకు ఈ పారిశ్రామిక పైప్‌లైన్లతో ఎలాంటి కనెక్షన్ ఉండదు. కాబట్టి డేటా సెంటర్లు ఎంత నీటిని వినియోగించినా అది నగరవాసుల తాగునీటి సరఫరాపై ఎటువంటి ప్రభావాన్నీ చూపించదు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఈ ప్రాంతానికి నీటిని తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో సుమారు రూ.1,050కోట్లు ఖర్చు చేసి, కాలువ నిర్మాణంలో ఉన్న అనేక అడ్డంకులను తొలగించింది. 181.99కి.మీ పొడవైన ఈ ఎడమ ప్రధాన కాలువలో మట్టి తవ్వకం పనులు దాదాపు పూర్తయ్యాయి. కాలువ ద్వారా ఇప్పటికే తూర్పు గోదావరి, పిఠాపురం పరిసర ప్రాంతాలకు నీరు ప్రవహిస్తోంది. అనకాపల్లి వద్దకు చేరుకొనే ఈ జలాల నుంచే ఒకవైపు వ్యవసాయ భూములకు సాగునీరు, మరోవైపు పరిశ్రమలకు ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా నీటి తరలింపు జరుగుతుంది.

# హత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను శిక్షించాలి

**దిశా కమిటీ మెంబర్, సర్పంచ్ ధారావత్ హేమలత**




కారేపల్లి సెప్టెంబరు 01 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండల సర్పంచ్ ల సంఘం ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామం ఆదివాసి గిరిజన నర్సింగ్ విద్యార్థిని ఒకే శిరీష ను మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ ప్రాంతం ప్రైమ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో విధులు నిర్వర్తించి తన గదిలో అనుమానస్పదంగా నర్స్ శిరీష పై అత్యాచారం, హత్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదం చేశారు. ఈ సందర్భంగా దిశా కమిటీ మెంబర్ , సర్పంచ్ ధారావత్ హేమలత మాట్లాడుతూ నర్స్ శిరీష పై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణ ఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, సమగ్ర దర్యాప్తు చేపట్టి, న్యాయస్థానంలో నేరం రుజువయ్యేలా పకడ్బందీ ఆధారాలు సేకరించాలని డిమాండ్ చేశారు. నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష విధించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం అధ్యక్షులు రంజిత్, హేమలత, రాఘవులు, సందీప్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి..

**కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి: టీటీడబ్ల్యూయూఆర్జేసీ సింగరేణి ఉద్యోగులు**




కారేపల్లి సెప్టెంబర్ 01 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండల పరిధిలోని గాంధీనగర్ టీజీటీడబ్ల్యూయుఆర్ జూనియర్ కాలేజ్ లో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తూ పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా టీటీడబ్ల్యూయూఆర్జేసీ, సింగరేణి ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగుల పెన్షన్ హక్కును దెబ్బతీసే కొత్త పెన్షన్ విధానం ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేసిన ఉద్యోగులు.. పెన్షన్ హక్కు సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితానికి పెన్షన్ భద్రత ఎంతో అవసరమని, ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. "పెన్షన్ హక్కు సాధించే వరకు పోరాటం ఆగదు.. ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

# కేజీబీవీ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ మహాధర్నా

**పాల్గొన్న కేజీబీవీపీ ప్రిన్సిపాల్ ఝాన్సీ సౌజన్య**



కారేపల్లి సెప్టెంబర్ 01 నిర్భయవార్త రిపోర్టర్. కేజీబీవీ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మంగళవారం నిర్వహించిన మహాధర్న టిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మహా ధర్నాలో కారేపల్లి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ సౌజన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ ను రద్దు చేయాలని,2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు చేయాలని,పిఆర్సి అమలు చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా కేజీబీవీ ఉపాధ్యాయులకు వర్తించాలని పేర్కొన్నారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన పీఆర్టీయూ మహాధర్నాలో కోరారు. కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సేవా, వేతన, పదోన్నతి తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించాలంటే కేజీబీవీలను బలోపేతం చేయడంతో పాటు సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆమె అన్నారు. కేజీబీపీ సమస్యలపై పిఆర్టియు అండగా నిలుస్తుందని అన్నారు.

# "వారధి" పుస్తకం అంశాలు ఉపాధ్యాయులకు అవగాహన కొరకు ఒకరోజు శిక్షణ

**గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లీష్ గణితం బోధిస్తున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా శిక్షణకు హాజరవ్వాలి ఐటీడీఏ పీవో బి రాహుల్**






భద్రాచలం సెప్టెంబర్ 1 నిర్భయ వార్త ప్రతినిధి. 2026-2027 విద్యా సంవత్సరానికి గాను, భద్రాద్రి కొత్తగూడెం మరియు ఖమ్మం జిల్లాల్లోని గిరిజన సంక్షేమ (ఆశ్రమ) ఆశ్రమ పాఠశాలల విద్యార్థులలో విజ్ఞానాన్ని మరియు పోటీతత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో 'VARADHIμ (వారధి) పుస్తకం ముద్రించబడి, ఆయా పాఠశాలలకు సరఫరా చేయడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ విద్యా సంస్థలలో 'VARADHI' పుస్తకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు గాను, భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం జిల్లాల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న గణితం ఆంగ్ల ఉపాధ్యాయులకు ఒక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినందున సంబంధిత ఉపాధ్యాయులు ఈ నెల 02.09.2026న మధ్యాహ్నం 3:00 గంటలకు భద్రాచలంలోని జుజు (ఆఔ) దీ.జు.ు. కళాశాలకు సకాలంలో హాజరుకావాలని ఆయన అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం మరియు ఖమ్మం జిల్లాల ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తమ పాఠశాలలకు చెందిన గణితం ఆంగ్ల ఉపాధ్యాయులను తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరయ్యేలా చూడాలని, భద్రాచలం మరియు ఖమ్మం ప్రాంతాలకు చెందిన ATDO\T ACMO, PMRC (విద్య) అధికారులు తగిన చర్యలు తీసుకుని శిక్షణకు సంబంధించిన నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆయన కోరారు.

# ప్రజాధనానికి లెక్క చెప్పాలి.. పదవికి రాజీనామా చేయాలి..!: కాంగ్రెస్



భద్రాచలం, సెప్టెంబర్ 1, నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం మండలంలో నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో భారీ బైక్ ర్యాలీ. అనంతరం ప్రజాధనానికి లెక్క చెప్పాలని, ప్రజలకు దూరంగా ఉంటున్న ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమై అంబేద్కర్ సెంటర్, యూబీ రోడ్, నెహ్రూ మార్కెట్, జీసీసీ రోడ్డు మీదుగా తిరిగి అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రతిపక్ష నాయకుడైనా ప్రజలకు దూరంగా ఉంటూ, సుమారు 1000 రోజులుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం విఫలమైతే ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించాల్సిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడే ప్రజలకు దూరంగా ఉంటే ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర ఏమిటని నిలదీశారు. గత మూడు సంవత్సరాలుగా ప్రజల సొమ్ము రూ.22 కోట్ల 24 లక్షల 40 వేల మొత్తాన్ని తీసుకుంటూ ప్రజలకు ముఖం చూపించని వ్యక్తి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారని తెలిపారు.



**భద్రాచలంలో కాంగ్రెస్ శ్రేణుల భారీ ప్రదర్శన** ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ బైక్ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు , కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో యూత్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల పక్షాన కాంగ్రెస్.. ప్రజాధనానికి లెక్క అడుగుతున్న కాంగ్రెస్..ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన ప్రతిపక్షం కోసం కాంగ్రెస్ పోరాటం...

# విద్యార్థినీ విద్యార్థులు కెరీర్ గైడెన్స్ ద్వారా భవిష్యత్తును బాగుపరచుకోవాలి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్



భద్రాచలం సెప్టెంబర్ 01 నిర్భయ వార్త ప్రతినిధి. చదువు పూర్తి కాగానే విద్యార్థినీ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకొని వారు భవిష్యత్తులో అనుకున్న గోల్డ్ సాధించడానికి ఇప్పటినుండే కెరీర్ గైడెన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భద్రాచలం నందు మహిళా సాధికారిక విభాగము కోఆర్డినేటర్ డాక్టర్ వి. రాఘ సుమ పర్యవేక్షణలో "లాంచ్ గర్ల్స్ కెరీర్ రెడీనెస్ ప్రోగ్రాం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు స్వీయ అవగాహన, ఆత్మవిశ్వాసం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకొని, అవగాహనతో కూడిన కెరీర్ను ఎంపిక చేసుకోవడం వలన భవిష్యత్తులో ఉద్యోగాన్ని సంపాదించుటకు అవసరమైన నైపుణ్యములను మూడు సంవత్సరముల కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాము ద్వారా తెలుసుకోవడంతో విద్యార్థినీ విద్యార్థులు వారు అనుకున్నది సాధించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిక విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ రాగ ప్రోగ్రాం అసోసియేట్ లహరి, డా. కపిలభారతి, డా. నాగ సమీరా, హిమజ అధ్యాపకురాళ్ళు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమం





చర్ల, సెప్టెంబర్ 1 నిర్భయ వార్త ప్రతినిధి. మంగళవారం చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సందర్శించి ఆశా ఆరోగ్య కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ వారం పోషకాహార లోపంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. శరీరానికి అవసరమైన విటమిన్లు, మినరల్స్, ప్రోటీన్లు తదితర పోషకాలు ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, ఇతర సమతుల్య ఆహార పదార్థాల ద్వారా లభిస్తాయని ప్రజలకు వివరించాలని చెప్పారు. మాంసాహారాన్ని అధికంగా తీసుకోవడం కంటే సమతుల్య ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, అధికంగా మాంసాహారం తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో కొన్ని అనారోగ్య సమస్యల ప్రమాదం పెరిగే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నేత్రదాన పక్షోత్సవాలు ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 5 వరకు జరుగుతున్నందున, నేత్రదానం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఒక వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా పలువురికి చూపును అందించే అవకాశం ఉంటుందని, ప్రజలు స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడుతూ, టీబీ ఎవరికైనా వచ్చే అవకాశం ఉన్న వ్యాధి అని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి టీబీ పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం టీబీ రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందిస్తోందని, వైద్యుల సూచనల మేరకు మందులను క్రమం తప్పకుండా వాడితే టీబీని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓ మరియు డీఐఓ డాక్టర్ ప్రతాప్ గారు మాట్లాడుతూ, ఈ నెల ఆశా సమావేశంలో వ్యాధి నిరోధక టీకాలు ముఖ్యమైన అంశంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి చిన్నారికి జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రకారం అన్ని టీకాలను సమయానికి వేయించాలని, ఒక్క టీకా కూడా మిస్ కాకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాల ద్వారా పోలియో వంటి తీవ్రమైన వ్యాధులను నియంత్రించగలిగామని, భవిష్యత్తులో కూడా టీకాలతో నివారించగల వ్యాధుల నుంచి ప్రజలను రక్షించేందుకు జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఆశా ఆరోగ్య కార్యకర్త ప్రజల్లో టీకాలపై అవగాహన పెంచడంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా సూచించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం నిర్వహించే "ఫ్రైడే డ్రై డే" కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా చేపట్టి, ఇళ్లలో మరియు పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకునేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం మేజర్ పంచాయతీ సమస్యలపై జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు కి వినతిపత్రం సమర్పణ



ములుగు సెప్టెంబర్ 01 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ, మౌలిక వసతుల కల్పన కోసం అదనపు సిబ్బందిని, చెత్త సేకరణ వాహనాలను మంజూరు చేయాలని కోరుతూ ములుగు జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు కి ఏటూరునాగారం గ్రామ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత , ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, సర్పంచ్ శ్రీలత మాట్లాడుతూ.. ఏటూరునాగారం వేగంగా విస్తరిస్తుండటంతో 3,600 నివాస గృహాలకు పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణలో తీవ్ర సిబ్బంది కొరత ఏర్పడిందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అదనపు మల్టీ పర్పస్ వర్కర్ల (ఎమ్‌పిడబ్ల్యూ) నియామకం: 22 కిలోమీటర్ల పరిధి కలిగిన గ్రామానికి పారిశుధ్య పనుల కోసం ప్రస్తుతం ఉన్న 16 మంది సిబ్బందికి తోడుగా అదనంగా 30 మంది ఎమ్‌పిడబ్ల్యూ సిబ్బందిని నియమించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. తాగునీరు వీధి దీపాల సేవలు: 66 నీటి ట్యాంకులు, పైప్‌లైన్ లీకేజీల పర్యవేక్షణకు ఇద్దరు, 1,420 వీధి దీపాల కనెక్షన్ల నిర్వహణకు ఇద్దరు సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. చెత్త సేకరణ వాహనాల మంజూరు: ప్రస్తుతం ఉన్న 2 ట్రాక్టర్లు సరిపోకపోవడంతో గ్రామ పంచాయతీకి మరో 2 హైడ్రాలిక్ చెత్త సేకరణ వాహనాలు (టాటా ఏస్) మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పోరిక గోవింద నాయక్, తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, భూక్యా జంపన్న, మాజీ ఎంపీపీ వినయ్ కుమార్, మల్కా రమేష్, తాడూరి రఘు, దయ్య అశోక్, రమేష్ రెడ్డి, లింగాల రమణారెడ్డి, నరసింహ నాయక్, చేన్న విజయ్, ఎండి ఖాజా పాషా, పాలెం శ్రీనివాస్, చిన్ని కృష్ణ, కోయిల మహేష్, బాడిశే నాగ రమేష్, చిట్టి మల్ల సమ్మయ్య, భూక్యా అమర్ సింగ్, ముడతన పెల్లి మోహన్, ముంజల బిక్షపతి, పోరిక విజయ్, బైక్ అని ఓదేలు, కోళ్ల వెంకన్న, కర్ర రవీందర్, వేణుగోపాల్, కుమ్మరి చంద్ర బాబు, జాడి బోజరావు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వైద్యసిబ్బంది ఉండాలి.. ఖమ్మం జిల్లా డిఎంహెచ్ఓ రామారావు





కారేపల్లి, సెప్టెంబర్ 1 నిర్భయవార్త రిపోర్టర్. ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యుల సమయ పట్టికను, హాజరు తీరును పరిశీలించారు. అనంతరం ఆశ వర్కర్ సమావేశంలో గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని వల వీధులు సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, మందుల లభ్యత తదితర అంశాలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కస్తూరిబా గాంధీ పాఠశాలన సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ సురేష్, ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ జేఏసీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం




ఖమ్మం సెప్టెంబరు 01 నిర్భయవార్త రిపోర్టర్. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫేస్టో లో పెట్టిన తెలంగాణ ఉద్యమకారుల డిమాశీడ్ల ను నెరవేరుస్తామన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఉద్యమకారుల కమిటీ కి హామీ ఇవ్వటంతో పాటు, సానుకూలంగా స్పందించటాన్నీ స్వాగతిస్తూ, తెలంగాణ ఉద్యమ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మ పట్టణ మయూరి సెంటర్ లో ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం దగ్గర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉద్యమకారుల జేఏసీ నాయకులు కే .వి కృష్ణారావు పాల్గొని, మాట్లాడుతూ, ముఖ్యమంత్రి గారు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతామని చెప్పటం హర్షించ దగ్గ విషయమని, ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తూ వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోనియాగాంధీ జన్మదినమైన డిసెంబర్ 9 లోపే ఉద్యమకారుల కిచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగా జేఏసి జిల్లా అధ్యక్షులు జిల్లా విజయకుమార్, బహుజన ఉద్యమ నేత మట్టే గురుమూర్తి, తెలంగాణ ఉద్యమ కారులనాయకులు కొరకోప్పు రామారావు, కోయచిలక గ్రామ మాజీ సర్పంచ్ మేళ్లచెరువు రాంప్రసాద్, వైరా మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేల్పుల మురళి, భాస్కర్ , వీరేందర్, అవినాష్ , మురళి, మధు, సుమతి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## వైరా నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చలు.



ఖమ్మం, సెప్టెంబర్ 01 నిర్భయవార్త రిపోర్టర్. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ వైరా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ను కోరారు. ఖమ్మం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ ను దివాకర టి.ఎస్ ను వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. అభివృద్ధి పనులు, రైతుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

# చౌటిగూడెంలో ఉకే శిరీష కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సీతక్క

## ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు






ములుగు సెప్టెంబర్ 01 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) తుక్కుగూడలో దారుణ హత్యాచారానికి గురైన నర్సు ఉకే శిరీష కుటుంబాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పరామర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెంలోని శిరీష స్వగ్రామానికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు నునావత్ రాధాబాయితో కలిసి వెళ్లిన మంత్రి సీతక్క.. శిరీష్ తల్లిని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. శిరీష చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శిరీష హత్యాచార ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి సీతక్క అన్నారు. ఘటన తెలిసిన వెంటనే పోలీసు అధికారులతో, డీజీపీతో మాట్లాడి దర్యాప్తు పురోగతిని పర్యవేక్షించామని తెలిపారు. నిందితుడిని వెంటనే గుర్తించి అరెస్టు చేయడంలో పోలీసులు వేగంగా స్పందించారని పేర్కొన్నారు. నిందితుడికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేమని, కానీ శిరీష కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకే స్వయంగా శిరీష కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చానని మంత్రి తెలిపారు. "అక్కా.. మీరు స్వయంగా వెళ్లి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పండి. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇవ్వండి" అని ముఖ్యమంత్రి తనకు సూచించారని పేర్కొన్నారు. అత్యంత నిరుపేద ఆదివాసీ కుటుంబానికి చెందిన శిరీష తన కాళ్లపై తాను నిలబడాలనే ఆశయంతో చదువుకుని నర్సుగా ఉద్యోగం చేస్తోందని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలనే ఆశతో హైదరాబాద్‌కు వచ్చి ఉద్యోగం చేస్తున్న యువతి ఇలాంటి దారుణ ఘటనకు బలికావడం అత్యంత బాధాకరమని అన్నారు. బంగారు భవిష్యత్తు ఉన్న ఒక ఆదివాసీ బిడ్డ.. ఎన్నో అవాంతరాలను అధిగమించి జీవితంలో ఎదగాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్న సమయంలో ఒక దుర్మార్గుడి చేతిలో ప్రాణాలు కోల్పోవడం జీర్ణించుకోలేకపోతున్నాం. శిరీష కుటుంబానికి జరిగిన నష్టాన్ని ఎవరూ పూడ్చలేరు. కానీ ఆ కుటుంబం ఒంటరిగా లేదనే భరోసాను ప్రభుత్వం కల్పిస్తుంది" అని మంత్రి అన్నారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల చెక్కును అందజేస్తామని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి రూ.1 లక్ష, ఐటీడీఏ నుంచి రూ.30 వేల సహాయంతో పాటు, తాను, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వ్యక్తిగతంగా రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు కోరిన ఇందిరమ్మ ఇల్లు, జీవనోపాధి కోసం సాగు భూమి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద బాధిత కుటుంబానికి అందాల్సిన పరిహారాన్ని కూడా నిబంధనల ప్రకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పట్టణాలకు ఉపాధి కోసం వచ్చే ఆదివాసీ, గ్రామీణ ప్రాంతాల యువతులు, ముఖ్యంగా ఉద్యోగినుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి సీతక్క అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన రక్షణ చర్యలను బలోపేతం చేస్తామని చెప్పారు. పట్టణాల్లో పనిచేస్తున్న ఆదివాసీ యువతులు అత్యవసర పరిస్థితుల్లో సహాయం పొందేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు. "శిరీషను తిరిగి తీసుకురాలేం. కానీ ఆమెకు జరిగిన అన్యాయానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది. నిందితుడికి కఠిన శిక్ష పడేలా అన్ని చర్యలు తీసుకుంటాం" అని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి సీతక్క వెంట స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు నునావత్ రాధాబాయి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## "వారధి" పుస్తకం అంశాలు ఉపాధ్యాయులకు అవగాహన కొరకు ఒకరోజు శిక్షణ

**గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లీష్ గణితం బోధిస్తున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా శిక్షణకు హాజరవ్వాలి ఐటీడీఏ పీవో బి రాహుల్**



భద్రాచలం సెప్టెంబర్ 1 నిర్భయ వార్త ప్రతినిధి. 2026-2027 విద్యా సంవత్సరానికి గాను, భద్రాద్రి కొత్తగూడెం మరియు ఖమ్మం జిల్లాల్లోని గిరిజన సంక్షేమ (ఃఔ) ఆశ్రమ పాఠశాలల విద్యార్థులలో విజ్ఞానాన్ని మరియు పోటీతత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో »VARADHI' (వారధి) పుస్తకం ముద్రించబడి, ఆయా పాఠశాలలకు సరఫరా చేయడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ విద్యా సంస్థలలో 'ఞూ=ూణఃఎ×' పుస్తకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు గాను, భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం జిల్లాల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న గణితం ఆంగ్ల ఉపాధ్యాయులకు ఒక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినందున సంబంధిత ఉపాధ్యాయులు ఈ నెల 02.09.2026న మధ్యాహ్నం 3:00 గంటలకు భద్రాచలంలోని బుజు (TW) B.Ed. కళాశాలకు సకాలంలో హాజరుకావాలని ఆయన అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం మరియు ఖమ్మం జిల్లాల ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తమ పాఠశాలలకు చెందిన గణితం ఆంగ్ల ఉపాధ్యాయులను తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరయ్యేలా చూడాలని, భద్రాచలం మరియు ఖమ్మం ప్రాంతాలకు చెందిన ATDO\T ACMO,PMRC (విద్య) అధికారులు తగిన చర్యలు తీసుకుని శిక్షణకు సంబంధించిన నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆయన కోరారు.

## దివాసీ యువతి ఉయిక శిరీషకు న్యాయం చేయాలి... దానవాయిపేటలో కొవ్వొత్తుల ర్యాలీ



చర్ల సెప్టెంబర్ 01 నిర్భయ వార్తప్రతినిధి. హైదరాబాద్ తుక్కుగూడలో అత్యాచారానికి గురై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన భద్రాద్రి జిల్లా ఆదివాసీ యువతి ఉయిక శిరీషకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చర్ల మండలం దానవాయిపేట గ్రామంలో మంగళవారం గ్రామస్తులు పెద్ద ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ, నిరసన చేపట్టారు. ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ తుర్రం రవి కుమార్ ఆధ్వర్యంలో యువత, మహిళా సంఘాలు, గ్రామ పెద్దలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి, కొవ్వొత్తులు వెలిగించి శిరీష చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఘటనకు బాధ్యులైన వారిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితుడు సైనావుల్లాపై చట్టపరమైన చర్యలు చేపట్టి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మహిళలకు భద్రత కల్పించడంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఇర్ప సంఘమిత్ర, నూప రమేష్ కోరారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని దానవాయిపేట యువత డిమాండ్ చేసింది. ఈ నిరసన కార్యక్రమంలో, సర్పంచ్ తుర్రం రవికుమార్, ఉప సర్పంచ్ కాపుల కృష్ణ అర్జునరావు దానవాయిపేట రుంజ రాజా,ూజుూూ మొబిలైజర్ నూపా రమేష్, ఆదివాసి యువ నాయకులు ఇర్పా సంఘమిత్ర గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హక్కుల కోసం గొంతెత్తుదాం.

**మైలవరం సభను విజయ వంతం చేద్దాం!**
**సెప్టెంబర్ 13న పీటీఎల్పీ యూ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ.**
**నందిగామలో పోస్టర్ ఆవిష్కరణ..**
**జన సమీకరణ పై నాయకుల దిశానిర్దేశం.**




నందిగామ,నిర్భయవార్త ప్రతినిధి ;:.ప్రజా సమస్యలు, హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా పీటీఎల్పీయూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న మైలవరంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సంస్థ అధ్యక్షుడు, స్టేట్ ప్రెసిడెంట్ కె.బాబ్జి (కఫీ) పిలుపునిచ్చారు. బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నందిగామలోని పీటీఎల్పీయూ కార్యాలయం లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించిన కె.బాబ్జి (కఫీ) మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సమష్టిగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేం దుకు, తమ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బహిరంగ సభలు కీలక వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.ప్రజా చైతన్యమే మార్పుకు తొలి అడుగు సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరంఉందని, ప్రతి ఒక్కరూ తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ప్రజా సమస్య లపై బలపడినప్పుడే పాలన లో జవాబుదారీతనం పెరుగు తుందని అన్నారు. సెప్టెంబర్ 13న మైలవరంలో జరిగే బహిరంగ సభకు పీటీఎల్పీయూ సభ్యులు, కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించి సభను విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు. సభ విజయవంతా నికి పటిష్ట కార్యాచరణబహిరంగ సభకు సంబంధిం చిన ఏర్పాట్లు, జన సమీకరణ, ప్రచార కార్యక్రమా లపై నాయకులు, సభ్యులకు కె.బాబ్జి (కఫీ) దిశానిర్దేశం చేశారు. సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యే లా క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్య లపై ఐక్యంగా నిలబడి, తమ హక్కుల సాధన కోసం చైతన్యంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. బహిరంగ సభను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించే చైతన్య వేదికగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.పోస్టర్ ఆవిష్కరణలో పలువురు నాయకులుఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు, స్టేట్ ప్రెసిడెంట్ కె.బాబ్జి (కఫీ) తో పాటు ఉలవలపూడి నరేంద్ర, సూర్యం, కె.లక్ష్మీకాంత్, అంకుబాబు, ఎస్‌కె.కాసిం, జానకిరామ్, కె.సుధీర్, సంజీవరావు, సీహెచ్. శ్రీనివాసరావు, సాల్మన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.ప్రజల కోసం.. ప్రజల హక్కుల కోసం.. ప్రజా చైతన్యం కోసం --- సెప్టెంబర్ 13న మైలవరం బహిరంగ సభకు తరలిరావా లని పీటీఎల్పీయూ నాయకులు పిలుపునిచ్చారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 'రణ్ హవా'.!!.

**ప్రైవేట్ ఉద్యోగి చేతిలో కీలక ఫైళ్లు.. అధికారుల అండదండలతోనే అంతా జరుగుతుంది అంటూ పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

నందిగామ, నిర్భయవార్త ప్రతినిధి :నందిగామ పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ ప్రైవేట్ ఉద్యోగి హవా నడుస్తోందని, అతను చెప్తేనే ఫైలు కదులుతుందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. సాదాసీదాగా కార్యాలయంలో చేరిన ఓ ప్రైవేట్ ఉద్యోగి ప్రస్తుతం కార్యాలయాన్ని శాసిస్తున్నాడని, అతని మాట వినాల్సిందే.. లేదంటే ఫైలు ఆగిపోవాల్సిందే అనే పరిస్థితి నెలకొందని దస్తావేజు లేఖరులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ వ్యక్తులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లోపలి గదుల్లోకి, విలువైన ఫైలు, రికార్డులు ఉండే ప్రాంతాల్లోకి వెళ్లకూడదు. అయినా నిబంధనలకు విరుద్ధంగా అధికారుల అండదండలతోనే ఈ ప్రైవేట్ ఉద్యోగి లోపల రూముల్లో తిరుగుతూ హవా నడిపిస్తున్నట్లు బహిరంగంగానే చర్చ జరుగుతోంది.సబ్ రిజిస్ట్రార్లు మారినా.. ఇతని రాజ్యమేసబ్ రిజిస్ట్రార్లు ఎందరు మారినా, ఎవరు వచ్చినా ఈ ప్రైవేట్ వ్యక్తి చెప్పు చేతల్లోనే ఉండాల్సిందేనని, అన్ని లావాదేవీలు అతని చేతుల మీదుగానే జరగాల్సిందేనని కార్యాలయం బయట బహిరంగంగా చెప్పుకుంటున్నారు. కింద స్థాయి ఉద్యోగుల నుంచి దస్తావేజు లేఖరుల వరకు




అందరూ ఇతని మాట వినాల్సిందేననే పరిస్థితి ఉందని తోటి ఉద్యోగులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాదు ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో జరిగిన ఫైళ్లకు పర్సంటేజీలను కేటాయించి అక్రమంగా సాయంత్రానికి దస్తావేజు లేఖరుల వద్ద నుండి వసూలు చేసి అధికారికి ఓ రహస్య స్థలంలో ఇస్తున్నట్లు దస్తావేజు లేఖరులే బహిరంగంగా చెప్పుకుంటున్నారు.అసలు ఒక ప్రైవేట్ వ్యక్తికి ప్రభుత్వ కార్యాలయంలోని విలువైన రికార్డుల వద్ద ఏం పని? అతనికి ఇంత అధికారం ఎవరు ఇచ్చారు? అధికారుల ప్రమేయం లేకుండా ఇది సాధ్యమేనా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, నందిగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న ఈ 'రణ్ హవా' పై విచారణ జరిపి, ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయాన్ని అరికట్టి కార్యాలయం లోపల బయట సీసీ కెమెరాలు బలోపేతం చేసి పటిష్టంగా పర్యవేక్షణ నిరంతరం చేయాలని ప్రజలు, రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు డిమాండ్ చేస్తున్నారు.

# నిజాయితీ చాటుకున్న లైన్ మెన్.

**దొరికిన రూ.లక్ష బ్యాంకు మేనేజర్ కు అప్పగింత.**

రాజంపేట,నిర్భయవార్త ప్రతినిధి :రాజంపేట పట్టణ పరిధిలోని ఆర్.ఎస్ రోడ్డులో జూనియర్ లైన్ మెన్ గా



విధులు నిర్వహిస్తున్న రాజేష్ సోమవారం మధ్యాహ్నం రాజంపేట పట్టణంలోని శివాలయం దగ్గర గల ఎస్.బి.ఐ బ్యాంకు దగ్గర గల ఏటీఎం వద్దకు నగదు డ్రా చేసుకోవడానికి వెళ్ళగా ఏటీఎం యంత్రం పైన ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు లక్ష రూపాయలు నగదు పెట్టి మరచిపోయి వెళ్ళగా అది గుర్తించిన రాజేష్ నగదు తీసుకొని ఒక క్షణం కూడా ఆలోచించకుండా ఎస్బిఐ మేనేజర్ కు అప్పగించాడు. పది రూపాయలకు కూడా కక్కుర్తి పడే మనుషులున్న ఈ రోజుల్లో లక్ష రూపాయల నగదును నిజాయితీగా మేనేజర్ కు అప్పగించిన రాజేష్ పై పలువురు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రతి ఒక్కరూ రాజేష్ లా నిజాయితీగా, మానవత్వంతో వ్యవహరిస్తే సమాజం బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# రాజంపేట అభివృద్ధి,సంక్షేమమే లక్ష్యం.

**టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్.**

రాజంపేట,నందలూరు నిర్భయవార్త ప్రతినిధి :రాజంపేట నియోజకవర్గంలో ప్రజలతో నిత్యం మమేకమవుతూ, పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ టీడీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్ రాజు పనిచేస్తున్నారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మండల కో-క్లస్టర్ ఇన్‌చార్జి చుక్క యానాది పేర్కొన్నారు. మంగళవారం నందలూరు మండలం, నాగిరెడ్డిపల్లి 101వ పోలింగ్ బూత్ పరిధిలో 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. చమర్తి సూచనల మేరకు గ్రామ గ్రామాన ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నామని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని చమర్తి నిరంతరం దిశానిర్దేశం చేస్తున్నారన్నారు.ఈకార్యక్రమంలో బూత్ కన్వీనర్ శివ, యువ నాయకులు అనిల్, సుబ్బయ్య, రమేష్, హరి, చిన్నికృష్ణ, సంజు, గణేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల గొంతుకగా మారిన చెట్టి పాల్గుణ.

**కూటమి సర్కార్ పై చెట్టి పాల్గుణ సమరం.**

అరకు,పాడేరు,అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి : విశాఖపట్నం జిల్లా మారికవలస గురుకుల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులను అక్కడే కొనసాగించి విద్యనందించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం మారికవలస ఆశ్రమ పాఠశాల ముందు ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించేందుకు వెళ్తున్న అరకు నియోజకవర్గ వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణను అరకు మండల పోలీసులు సుంకరమెట్ట చెక్ పోస్ట్ వద్ద అరెస్టు చేసి అరకు పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ మీడియాతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతం, గిరిజనులను కూటమి ప్రభుత్వం ఘోరంగా, తక్కువగా చూస్తోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. చివరకు గిరిజన విద్యార్థుల చదువుకు కూడా ఆటంకం కలిగించడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, వారి భవిష్యత్తు బాగుండాలని తల్లిదండ్రులు పోరాటం చేస్తున్నారని, వారు కోట్ల రూపాయల ఆస్తులు అడగడం లేదని, తమ పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించాలని మాత్రమే కోరుతున్నారని అన్నారు. ఐఐటీ--జేఈఈ కోచింగ్ పేరుతో మారికవలసలో చదువుతున్న గిరిజన విద్యార్థులను ఏజెన్సీ ప్రాంతానికి తరలించేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, విద్యార్థులను ఏజెన్సీ ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించి అక్కడే చదివించాలని చెప్పడంతో తల్లిదండ్రులు, అఖిలపక్ష నాయకులు కలిసి పోరాటం చేసిన తరుణంలో స్థానిక జిల్లా అధికారులు సీఎం చంద్రబాబు నాయుడు ఏజెన్సీ పర్యటనకు ముందు రోజు స్థానిక ఐటీడీఏ పీఓ సైతం విద్యార్థులు యథావిధిగా మారికవలసలోనే కొనసాగుతారని చెప్పారని, ఇప్పుడు మళ్లీ విద్యార్థులను అక్కడి నుంచి తరలించేందుకు సిద్ధం కావడం మసిపూసి మారేడు కాయ చేసినట్టుగా ఉందని విమర్శించారు. శాంతియుతంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు మారికవలస పాఠశాల ముందు ధర్నా చేస్తుంటే, వారికి సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న వైసీపీ నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం గళం ఎత్తితే కేసులు పెట్టడం, పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను ఉపయోగించుకుని నాయకులను అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఏజెన్సీ ప్రాంతంలో వైసీపీ బలపడుతుందనే ఉద్దేశంతోనే గిరిజనులపై కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని అన్నారు . వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుండి వారి కుమారుడు మాజీ సీఎం జగనన్న చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకుని ఏజెన్సీ ప్రాంతంలో గత కొన్ని దఫాలుగా ఏజెన్సీ ప్రాంతంలో వైసిపి జెండా ఎగురుతుందని ఇక్కడ టిడిపిని గెలిపించలేదనే దృక్పథంతోనే నేడు గిరిజనులపై కక్ష సాధింపు జరుగుతోందని అన్నారు. అధికారంలోకి రాకముందు సీఎం చంద్రబాబు నాయుడు గిరిజనులకు జీవో నం.3 పునరుద్ధరణ చేస్తామని, ప్రత్యామ్నాయ జీవో తీసుకొస్తామని హామీ ఇచ్చారని, రెండున్నర సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు ఆ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. గిరిజనులను నేటి ప్రభుత్వం మసిపూసి మారేడు కాయ చేస్తున్నారని మండిపడ్డారు. 1/70 చట్టం విషయంలోనూ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని ఆరోపించారు. 1/70 చట్టాన్ని ఎత్తివేయాలని కొందరు నాన్ ట్రైబ్స్ కోర్టును ఆశ్రయిస్తే గిరిజనులకు మేమున్నామని చెప్పే కూటమి ప్రభుత్వం కనీసం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, మరి గిరిజన విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గిరిజనుల పట్ల చిత్తశుద్ధి ఉంటే జీవో నం.3 పునరుద్ధరణ చేయాలని లేదా ప్రత్యేక ప్రత్యామ్నాయ జీవో తీసుకురావాలని, 1/70 చట్టాన్ని పటిష్టం చేయాలని, నేడు గిరిజన విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులను మారికవలస నుంచి తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని కోరారు. సీఎం చంద్రబాబు నాయుడు ఏజెన్సీ పర్యటనకు వచ్చి ఏం చేశారని, కేవలం చప్పట్లు కొట్టించుకోవడానికి మాత్రమే వచ్చారాని ఎద్దేవా చేశారు.. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందలేదని, ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని స్వయంగా ప్రభుత్వమే అంగీకరిస్తున్నప్పుడు గిరిజనుల సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని నిలదీశారు. గిరిజనులను ఆదివాసీలా హక్కులు, చట్టాలను నేటి ప్రభుత్వం చులకన భావంతో చూస్తూ తుంగ్గలోకి తొక్కేందుకు చూస్తే ఆదివాసీలు మూలవాసులు అనే విషయం గుర్తుంచుకోవాలని శాంతియుతంగా చేస్తున్నామని మీరు చులకనా భావంతో చూస్తే ఆనాటి అల్లూరి సీతారామరాజును మరల నేడు చూడాల్సి ఉంటుందని ప్రభుత్వంను హెచ్చరించారు. ఎన్ని అన్యాయాలు చేసినా వైసీపీ ప్రభుత్వం గిరిజనులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని, గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. గిరిజనులకే కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ న్యాయం జరిగేందుకు అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని, ప్రభుత్వం పెట్టే కేసులకు భయపడి వెనక్కి తగ్గేది లేదని తేల్చిచెప్పారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. స్థానిక ఎన్నికలే ప్రభుత్వానికి సమాధానం చెబుతాయని, రాబోయే రోజుల్లో వైసీపీ జెండా ఎగురుతుందని, ప్రజలు వైసీపీ వైపే ఉన్నారనే విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తుంచుకోవాలని మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ సవాల్ విసిరారు.




# మీ సమస్యకు పరిష్కారం కావాలా?

**అధికారుల ముందుకు రండి!**
**ఆగస్టు 31న ప్రజా సమస్యల పరిష్కార వేదిక..**
**ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు అర్జీల స్వీకరణ.**
**జిల్లా ప్రజలకు కలెక్టర్ డా.జి. లక్ష్మీశ పిలుపు.**

విజయవాడ,నిర్భయవార్త ప్రతినిధి :జిల్లా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి వేగవంతమైన,పారదర్శకమైన పరిష్కారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ప్రజలసమస్యలకు అధికారులే బాధ్యతగా స్పందించేలా లి'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లిను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరం లో ఆగస్టు 31, సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా స్థాయిలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరిస్తారు. సమస్యను మనసులో పెట్టుకోకండి.. అధికారుల దృష్టికి తీసుకురండి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సమస్య పరిష్కారం కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తమ సమస్యను స్పష్టంగా వివరించి అర్జీ సమర్పిస్తే సంబంధిత శాఖ అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని



తెలిపారు.మీ సమస్య చిన్నదైనా.. పెద్దదైనా.. పరిష్కారం కోసం మీ గొంతు అధికారుల వరకు చేరాలి. ప్రజలు తమ సమస్య లను దాచుకోకుండా, సరైన వివరాలు మరియు ఆధారాల తో అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.అర్జీ ఇలా ఉంటే పరిష్కారం మరింత సులభం ప్రజలు అర్జీ సమర్పించే సమయంలో తప్పనిసరిగా---పూర్తి పేరు పూర్తి చిరునామా మొబైల్ నంబర్ సమస్యకు సంబంధించిన సంపూర్ణ వివరాలు సమస్యకు సంబంధించిన ఆధార పత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లు స్పష్టంగా జతచేయాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే ఇదే సమస్యపై గతంలో ఫిర్యాదు చేసిన వారు పాత అర్జీ రశీదు లేదా ఫిర్యాదు రసీదును వెంట తీసుకురావాలని తెలిపారు. గత ఫిర్యాదు వివరాలను పరిశీలించడం ద్వారా తదుపరి చర్యలను మరింత వేగంగాచేపట్టేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. కలెక్టరేట్‌కు రాలేకపోయినా ఫిర్యాదు చేయొచ్చు ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి కలెక్టరేట్‌కు వ్యక్తిగతంగా రావడం తప్పనిసరి కాదని కలెక్టర్ తెలిపారు. 1100 టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని, అలాగే meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ లోనూ తమ సమస్యలను నమోదు చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు.అర్జీ పరిష్కార ప్రక్రియలో పురోగతిని ప్రజలు సులభంగా తెలుసుకునేలా ప్రభుత్వం ఎస్ఎంఎస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు.మీ ఊరి దగ్గరే అర్జీ ఇచ్చే అవకాశంప్రజలకు సేవలను మరింత చేరువ చేసేందుకు డివిజన్, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ అర్జీలను స్వీకరించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలను సంప్రదించి సమస్యలను నమోదు చేసుకోవచ్చని సూచించారు.ప్రతి అర్జీని పరిశీలించాలిప్రజల నుంచి అందే ప్రతి అర్జీని సంబంధితఅధికారులు బాధ్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీ తనంతో కూడిన సేవలు అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధానలక్ష్యమని డాక్టర్ జి.లక్ష్మీశ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మీ సమస్యకు పరిష్కారం కావాలంటే..అర్జీ ఇవ్వండి ౹ ఆధారాలు జతచేయండి౹ ఫిర్యాదు స్థితిని తెలుసుకోండి ౹ పరిష్కారం కోసం అధికారు లను సంప్రదించండి ప్రజల సమస్యే ప్రభుత్వ బాధ్యత --- పరిష్కారం దిశగా ప్రతి అడుగు ముందుకు.

## పపాయి నర్సరీలను తనిఖీ చేసిన జిల్లా ఉద్యానశాఖ అధికారి.



రైల్వే కోడూరు, నియోజకవర్గం, నిర్భయవార్త ప్రతినిధి :. బొప్పాయి సాగుకు అవసరమైన నాణ్యమైన మొక్కలు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా ఉద్యానశాఖ అధికారి జయభారత్ రెడ్డి సూచించారు.రైల్వేకోడూరు ప్రాంతంలోని బొప్పాయ నర్సరీలను ఆయన సందర్శించి, నర్సరీ యజమానులతో పాటు రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బొప్పాయి విత్తనాల లభ్యత, నాణ్యత, ధరలు, మొక్కల నాణ్యత తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆరోగ్యవంతమైన మొక్కలు అందించడం ద్వారా పంట దిగుబడి, నాణ్యత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు.బొప్పాయి సాగుకు రైతుల నుంచి పెరుగుతున్న డిమాండ్ కు అనుగుణంగా నర్సరీల లో తగినంత మొక్కల లభ్యత ఉండేలా చూడాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. విత్తనాల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, రైతులకు నాణ్యమైన విత్తనాలు మరియు మొక్కలను మాత్రమే విక్రయించాలని తెలిపారు.అదేవిధంగా, నర్సరీ యజమానులు నర్సరీ చట్టం మరియు ఉద్యానశాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. నర్సరీల లో మొక్కల ఉత్పత్తి, విత్తనాల వినియోగం, విక్రయాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాల్లో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.రైతులు కూడా బొప్పాయి మొక్కలను కొనుగోలు చేసే సమయంలో మొక్కల నాణ్యత, విత్తన రకం, బిల్లులు మరియు సంబంధిత వివరాలను పరిశీలించి, గుర్తింపు పొందిన/నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్న నర్సరీల నుంచే మొక్కలను కొనుగోలు చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సూచించారు.ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారులు ఎం వెంకట భాస్కర్, నర్సరీ యజమానులు, బొప్పాయి రైతులు పాల్గొన్నారు.

## స్కూటీ అందితే.. స్వావలంబనకు రెక్కలు!

### విభిన్న ప్రతిభావంతుల జీవితాల్లో కొత్త వెలుగులు.
### ఆత్మవిశ్వాసమే ఆయుధం.. అవకాశాలే లక్ష్యం.
### ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ,నిర్భయవార్త ప్రతినిధి :"వైకల్యం శరీరానికే.. ఆత్మవిశ్వాసానికి కాదు!" సరైన ప్రోత్సాహం, ప్రభుత్వ సహకారం అందితే విభిన్న ప్రతిభావంతులు ఎవరికీ తీసిపోరని నిరూపించేలా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని కాకాని నగర్‌లోని తన కార్యాలయం లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన నూతన స్కూటీలను విభిన్న ప్రతిభా వంతులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అందజేశారు. కూటమి నాయకులతో కలిసి స్కూటీల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భం గా లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.స్కూటీలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉద్యోగం, ఉపాధి, స్వయం ఉపాధి రంగాల్లో అవకాశాలనుఅందిపుచ్చుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు.సాయం కాదు.. సాధికారతే అసలైన సంక్షేమం! విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందించే ప్రతి సహాయం వారి జీవితాన్ని మార్చే అవకాశంగా మారాలని ఎమ్మెల్యే అన్నారు."ప్రభుత్వం ఇచ్చే తోడ్పాటు మీ ప్రయాణానికి వాహనం మాత్రమే కాదు.. మీ భవిష్యత్తుకు ఒక మార్గం. ఇతరులపై ఆధారపడకుండా మీ పనులను మీరే చేసుకునే స్థాయికి ఎదగాలి" అని లబ్ధిదారులకు సూచించారు.విభిన్న ప్రతిభావంతులను జాలితో చూడాల్సిన అవసరం లేదని, వారికి సమాన అవకాశాలు, గౌరవం, స్వతంత్రంగా జీవించే పరిస్థితులు కల్పించడమే సమాజం బాధ్యత అని పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంలో సంక్షేమానికి కొత్త దిశ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంక్షేమానికి కొత్త దిశనుచూపుతోందని తంగిరాల సౌమ్య తెలిపారు.అర్హత ఉన్న ప్రతికుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామనిచెప్పారు. ముఖ్యంగా విభిన్న ప్రతిభా వంతుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ప్రభుత్వ సంకల్ప మని స్పష్టం చేశారు. ఒక స్కూటీ.. ఎన్నో అవకాశాలు!నూతన స్కూటీలు లబ్ధిదారుల రోజువారీ ప్రయాణాన్ని సులభతరం చేయడంతో పాటు విద్యాసంస్థలు, ఉద్యోగ ప్రదేశాలు, వ్యాపార కేంద్రాలు, స్వయం ఉపాధిఅవకాశాలను చేరుకోవడానికి ఉపయోగపడ తాయని ఎమ్మెల్యే తెలిపారు.ప్రయాణం సులభమైతే అవకాశాలు దగ్గరవుతాయి.. అవకాశాలు దగ్గరవుతే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.. ఆత్మవిశ్వాసం పెరిగితే స్వావలంబన సాధ్యమవుతుంది అని పేర్కొన్నారు.అందువల్ల లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుని తమ జీవితాల్లో ఉన్నతమైన మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత ప్రజల అవసరాల ను గుర్తించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని తంగిరాల సౌమ్య తెలిపారు. సంక్షేమం అంటే కేవలం ఆర్థిక సహాయం అందించడం కాదు.. ప్రతి వ్యక్తి తన జీవితాన్ని తానే నిర్మించుకునేలా చేయడం. అదే నిజమైన సాధికారత.. అదే సమాజ అభివృద్ధికి అసలైన బాట అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు, అధికారులు,ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.చైతన్య సందేశంవిభిన్న ప్రతిభావంతులారా.. మీలోని ప్రతిభనుగుర్తించండి.ప్రభుత్వం అందించే అవకాశాలను అందిపుచ్చుకోండి.ఇతరులపై ఆధారపడకుండా మీ కాళ్లపై మీరు నిలబడండి.
మీ విజయం.. సమాజానికి స్ఫూర్తి కావాలి!

## సెప్టెంబర్ 11, 12 అనంతపురంలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం మహాసభను జయప్రదం చేయాలని.



కర్నూలు జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి :.అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 9వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు కర్నూలు నగరంలోని ఎన్ .ఆర్ భవన్‌లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బి. వెంకటస్వామి మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అఖిల భారత రైతు కూలీ సంఘం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు, భూమి, ఉపాధి, ఆహార భద్రత వంటి ప్రజా సమస్యలపై సంఘం ఉద్యమిస్తోందని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను తిప్పికొట్టాలని ఆయన అన్నారు. రైతుల సాగు భూములను రక్షించడంతో పాటు వ్యవసాయ కూలీలకు ఉపాధి, మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేశారు. మహాసభలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, నాయకులు హాజరవుతారని చెప్పారు.రైతు కూలీల సమస్యలపై చర్చించి, భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించేందుకు ఈ మహాసభలు కీలకంగా నిలుస్తాయని వెంకటస్వామి తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ూా×ఖమీూ నాయకులు నారాయణ, రాజు, కళ్యాణ్, తిమ్మన్న, మద్దిలేటి, శివ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం.. ప్రాణదానం!

### పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో సేవా స్ఫూర్తి చాటిన నందిగామ.
### మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన.
### యువతకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పిలుపు.

నందిగామ,నిర్భయవార్త ప్రతినిధి :.ఒకరి రక్తం మరొకరి ప్రాణాన్ని నిలబెట్టగలదు.. ఆపదలో ఉన్న కుటుంబంలో ఆశాదీపాన్ని వెలిగించగలదు. అందుకే రక్తదానం కేవలం దానం కాదు.. అది ఒక ప్రాణదానం, మహోన్నతమైన మానవ సేవ. ఈ సేవా స్ఫూర్తిని చాటుతూ జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నందిగామలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నందిగామ పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లోని బాబు జగ్జీవన్ రామ్ బిల్డింగ్‌లో టీం పవన్ ఆర్మీ--నందిగామఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరానికి ప్రజలు, యువత, జనసైనికులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు.

**రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి!**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..




రక్తం అందుబాటులో లేక ఆపదలో ఉన్న అనేకమంది ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఎదురవుతున్నాయని, అలాంటి సమయంలో మనం చేసే రక్తదానం ఒక కుటుంబా నికి జీవితాంతం గుర్తుండి పోయే సేవగా నిలుస్తుందని పేర్కొన్నారు. "మనకు ఇచ్చేది కొద్దిపాటి రక్తమే.. కానీ అది ఒకరి జీవితానికి వెలకట్టలేని బహుమతి. రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి'' అంటూ యువతకు ఆమె పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని, మానవతా విలువలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు.

**యువత ముందుకు రావాలి**

రక్తదానంపై అపోహలను వీడి ఆరోగ్యవంతులైన యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం ఎదురుచూస్తున్న రోగులకు సకాలంలో రక్తం అందించడం ద్వారా ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. "ఈ రోజు మీరు ఇచ్చే రక్తం.. రేపు ఎవరో ఒకరి జీవితానికి ఊపిరి కావచ్చు" అని ప్రజలకు సందేశం ఇచ్చారు.

**రక్తదాతలకు అభినందనలు**

ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిం చారు. రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లు, హెల్మెట్లను అందజేసి అభినందించారు. సేవా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి రక్తదాతను ప్రత్యేకంగా ప్రశంసించారు.

**సేవా కార్యక్రమాలకు కూటమి ప్రాధాన్యత**

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమా లకు కూడా ప్రాధాన్యత ఇస్తోందని కూటమి నాయకులు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త, దుర్గ మల్లేశ్వర స్వామి దేవస్థాన బోర్డు సభ్యురాలు తంబపల్లి రమాదేవి, నందిగామ ూాజూ చైర్మన్ కొట్టే బద్రి, పవన్ ఆర్మీ నాగేంద్ర, అనాసాగరం జనసేన నాయకుడుపుప్పాల భరత్ సాయి, వీర మహిళలు కంసాని సుగుణ, చలమల సౌందర్య, కొట్టె కోటేశ్వరమ్మ, రంగా మాధవి, నగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ఒక్క అడుగు.. ఒక ప్రాణానికి అండ!**

రక్తదానం చేసే అలవాటును ప్రతి ఒక్కరూ సామాజిక ఉద్యమంగా మార్చుకోవాలని నిర్వాహకులు కోరారు. పుట్టిన రోజులు,జయంతులు, ప్రత్యేక సందర్భాలను కేవలం వేడుకలుగా కాకుండా రక్తదానం, సేవా కార్యక్రమా లతో నిర్వహిస్తే సమాజానికి మరింత మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

రక్తం ఇవ్వడానికి కొన్ని నిమిషాలే పడుతుంది.. కానీ ఆ రక్తం ఒక ప్రాణానికి కొత్త జీవితాన్ని ఇవ్వగలదు.

**రక్తదానం చేద్దాం.. ప్రాణాలను కాపాడుదాం..**

**మానవత్వాన్ని చాటుదాం!**

## నెల్లేపల్లి లో శ్రీకృష్ణ యాదవ గొర్రెల సహకార సంఘం కమిటీ ఏర్పాటు.

ఎస్ఆర్ పురం , నిర్భయవార్త ప్రతినిధి ;:.శ్రీకృష్ణ యాదవ గొర్రెల సహకార సంఘం కమిటీ ఏడు మందితో కమిటీ ఏర్పాటు ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లి గ్రామంలో శ్రీకృష్ణ యాదవ గొర్రెల సహకార సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేసి అధ్యక్షులుగా మార్కొండయ్య, సెక్రటరీగా ఆనంద్ ,డైరెక్టర్ అంజయ్య, కళావతి, జి .లక్ష్మీ , వి.లక్ష్మి, శాంతమ్మల ను టు కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీలను జిల్లా యాదవ గా సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ , దేవరాజులు నాయుడు సహకారంతో ఎన్నికల నిర్వహించి ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని మరోసారి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరూపించారని అన్నారు.నేడు మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ శ్రీకృష్ణ యాదవ గొర్రెల సహకార సంఘ కమిటీలు మహిళలకు చోటు పంపించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కమిటీతో గొర్రెల కాపరి అభివృద్ధికి అంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దేవరాజుల నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, నాయకులు భీమయ్య అనిల్ పురుషోత్తం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులున్నా ఆగని పింఛన్లు...

### ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి...

శ్రీకాళహస్తి, నిర్భయవార్త ప్రతినిధి :రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సక్రమంగా



లేకపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి నెల ఒకటో తేదీ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని 19వ వార్డులో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అర్హులైన వృద్ధులు వితంతువులకు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేదని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకటో తేదీ సామాజిక పింఛన్లు ఇవ్వడం మాత్రం మనడం లేదని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయకుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు కూడా పాల్గొన్నారు. తొట్టబేడు మండలం



పొయ్య గ్రామంలో కిడ్నీ వ్యాధితో ఇబ్బంది పడుతున్న ఆకాష్ అనే యువకుడికి పదివేల రూపాయల పింఛన్ను టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు మునిరాజా నాయుడు అందజేశారు. గత నెల ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గ్రామానికి వచ్చిన సందర్భంగా సమస్యను తెలుసుకున్నారని అధికారులతో చర్చించి మంజూరు చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శంకర్ నాయుడు రమేష్, ప్రసాద్ నాయుడు కూడా పాల్గొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో పట్టణ సహకార్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ డిల్లీబాబు పాల్గొన్నారు...

# LKG నుంచి కళల్ని ఔపోషణ పడుతున్న తెలుగమ్మాయి!

టాలీవుడ్‌లో ట్రెండింగ్ కథానాయికగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంటోంది తెలుగమ్మాయి అనంతిక సనిల్ కుమార్. టాలీవుడ్‌లో ట్రెండింగ్ కథానాయికగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంటోంది తెలుగమ్మాయి అనంతిక సనిల్ కుమార్. చిన్నతనం నుంచే కళలను శ్వాసించిన ఈ భామ.. ప్రస్తుతం పొరుగు భాషల్లోనూ వరున అవకాశాలు దక్కించుకుంటూ పరిశ్రమలో నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టిస్తోంది. ఎల్.కే.జీ చదువుతున్న రోజుల నుంచే నృత్యం, యుద్ధ విద్యలు (ఫైట్స్) వంటి విభిన్న కళా రూపాలను సాధన చేయడం తన అభిరుచిగా మార్చుకున్నానని తెలిపింది. శారీరక శ్రమతో కూడిన ఈ సాధనే నటిగా తన హావభావాలను, ప్రతిభను మెరుగుపరుచుకోవడానికి ఎంతగానో దోహదపడిందని వివరించిన తీరు



ఆశ్చర్యపరుస్తోంది. ఆనంద్ దేవరకొండ పర్ఫెక్ట్ క్లారిటీ అవకాశం వచ్చిన ప్రతి భాషనూ గౌరవిస్తూ తమిళం, మలయాళం, తెలుగు భాషల్లో సమాంతరంగా ప్రాజెక్ట్‌లు అంగీకరిస్తున్నట్లు అనంతిక వెల్లడించింది. ఊరికే ఇంట్లో సమయాన్ని వృథా చేయడం తనకు అస్సలు నచ్చదని.. దేవుడు రోజులో అందించే సమయాన్ని కళా సాధనకే కేటాయిస్తుంటానని పేర్కొంది. డ్యాన్స్, రకరకాల పాత్రల సాధన ద్వారా నటనలోని లోతులను సులభంగా అర్థం చేసుకోగలిగానని తెలిపింది. ఏ ఒక్క భాషకే పరిమితం కాకుండా.. ఎక్కడ మంచి కథలు లభిస్తే అక్కడ తన నటనతో ఆకట్టుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఈ యంగ్ బ్యూటీ వెల్లడించింది. అనంతిక కథానాయికగా నటించిన తాజా చిత్రం –రోమాంచకం– విడుదలకు సిద్ధమవుతుండటంతో సంతోషం వ్యక్తం చేస్తోంది. బ్లాక్‌బస్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ పతాకంపై ప్రణయ్ రెడ్డి వంగా ఈ చిత్రాన్ని నిర్మించగా.. వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహించారు. సుమంత్ ప్రభాస్, అనంతిక జంటగా నటించిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. –8 వసంతాలు– చిత్రం తర్వాత వచ్చిన అనేక కథలు తనను సంతృప్తి పరచలేదని, కానీ –రోమాంచకం– లైన్ వినగానే వెంటనే అంగీకరించానని అనంతిక ఈ సందర్భంగా గుర్తుచేసుకుంది. ఈ సినిమాలో తానొక చలాకీ (బబ్లీ) తమిళ అమ్మాయి పాత్రలో కనిపించబోతున్నానని.. ఇది తన డ్రీమ్ రోల్ అని అనంతిక సంతోషం వ్యక్తం చేసింది. నేటి తరం యువత జీవితాల్లో జరిగే వాస్తవిక అంశాలను, సమకాలీన సంఘటనలను ఎంతో ఆకట్టుకునేలా ఈ చిత్రంలో పొందుపరిచారు. హీరో సుమంత్ ప్రభాస్ ఎనర్జిటిక్ పాత్రకు ఏమాత్రం తగ్గకుండా తన క్యారెక్టర్ కూడా పోటాపోటీగా ఉంటుందని.. వీరిద్దరి మధ్య వచ్చే సంభాషణలు ఎంతో సహజంగా.. వేగవంతమైన స్క్రీన్‌ప్లేతో అలరిస్తాయని తెలిపింది. ప్రేమతో పాటు హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఈ చిత్రం యూత్‌కే కాకుండా ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కూడా పక్కా ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తుందని తెలిపింది.

# దేవరకొండ ఒకే చెప్పి ఉంటే. లోకేష్ కు చాన్స్ మిస్ అయ్యేదా?

విజయ్ దేవరకొండ, దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ ఒకప్పుడు కలిసి సినిమా చేయాలని అనుకున్నారు.



విజయ్ దేవరకొండ, దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ ఒకప్పుడు కలిసి సినిమా చేయాలని అను కున్నారు. ఇద్దరూ రెండు మూడు సార్లు కలిశారని ఆనంద్ దేవరకొండ రీసెంట్ గా చెప్పాడు. కథ, సినిమా ఎలా ఉ ండాలి అనే విషయంలో కూడా ఇద్దరికీ మంచి అవగాహన కుదిరి ందట. కానీ అప్పటికే విజయ్ చేతిలో వరుస సినిమాలు ఉండటంతో ఆ ప్రాజెక్ట్‌కు సరైన సమయం దొరకలేదు. చివరకు కాంబినేషన్ అక్కడితో ఆగిపోయింది. అయితే అరుణ్ విజయ్‌కు చెప్పింది ఇప్పుడు లోకేష్ కనగరాజ్ హీరోగా వచ్చిన 'డీసీ' కథేనా డౌట్ వస్తోంది. రెగ్యులర్ గా అవే కథలు అనే ఆలోచనతో కూడా విజయ్ ఆ కథను పక్కన పెట్టినట్లు టాక్ వచ్చింది. ఆనంద్ మాత్రం డేట్స్ కూడా సమస్య అయ్యాయని గుర్తు చేశాడు. ఇక అరుణ్ లోకేష్ కాంబినేషన్ వివరాల్లోకి వెళితే.. అప్పటికే దర్శకుడిగా పెద్ద సినిమాలు చేస్తున్న లోకేష్‌ను హీరోగా తీసుకోవాలని అరుణ్ ఓ పార్టీలో అనుకున్నాడట.కథ నచ్చడంతో లోకేష్ కూడా ఒప్పుకున్నాడు. అలా 'డీసీ'తో అతను పూర్తి స్థాయి హీరోగా మారాడు. దర్శకుడిగా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా అరుణ్ సినిమాలో హీరో కావడం అప్పట్లోనే పెద్ద సర్‌ప్రైజ్. ఇప్పుడు విజయ్, అరుణ్ సినిమా అప్పుడే జరిగి ఉంటే ఈ లెక్క ఇంకోలా ఉండేదేమో అనే మాట వస్తోంది. అరుణ్ ముందుగా విజయ్‌తో సినిమా పూర్తి చేసి ఉంటే, అదే సమయంలో లోకేష్‌తో 'డీసీ' మొదలయ్యేదా లేదా అనే కామెంట్స్ వస్తున్నాయి. లోకేష్ కూడా తన దర్శకత్వ సినిమాలతో బిజీగా ఉండటంతో అతని హీరో ఎంట్రీ మరికొంత ఆలస్యమయ్యే ఛాన్స్ ఉండేది. పైగా 'డీసీ' కూడా మొదట అనుకున్న రూపంలోనే తెరపైకి రాలేదు. చాలా ఏళ్ల క్రితం సిద్ధార్థ్‌ను కూడా ఈ ప్రాజెక్ట్ కోసం అనుకున్నట్లు కెమెరామెన్ గతంలో చెప్పాడు. అప్పటి కథ, ఇప్పుడు వచ్చిన సినిమా మధ్య చాలా మార్పులు జరిగాయని కూడా వెల్లడించాడు. అంటే హీరోలు మాత్రమే కాదు, కథ కూడా కాలంతో పాటు మారిపోయింది. ఇక ఆ లిస్టులో దేవరకొండ కూడా ఉండి ఉండవచ్చు. ఆనంద్ చెప్పిన మాటల్లో ఫ్యాన్స్ ఫీలింగ్ కూడా ఉ ంది. విజయ్ ఆ సినిమా చేసి ఉంటే ఎలా ఉండేదని చాలా మంది ఇప్పటికీ కామెంట్స్ పెడుతూనే ఉన్నారు. కానీ అనుకున్నవన్నీ జరగవు అది కామన్ అంటూ ఆనంద్ ఓ వివరణ ఇచ్చాడు. లోకేష్ మాత్రం 'డీసీ'తో హీరోగా మరో కొత్త రూట్ లోకి వచ్చాడు. అరుణ్, లోకేష్ మళ్లీ కలిసి పని చేసే అవకాశం ఉందనే వార్తలు వచ్చాయి. ఇక విజయ్ కాంబో ఎప్పుడూ సెట్టవుతుందో చూడాలి.

# 'వారణాసి' ఆ విషయంలో తొందర పడటం లేదు..?




దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా షూటింగ్ తుది దశకు చేరింది. అయితే, ఈ సినిమా కోసం డిజిటల్ రైట్స్ విషయంలో మేకర్స్ ఆచి తూచి అడుగులు వేస్తున్నారట. అన్ని భాషల డిజిటల్ రైట్స్ కోసం నెట్‌ఫ్లిక్స్ రూ. 150 కోట్లు ఆఫర్ చేయగా, మేకర్స్ అంచనాలకు ఆ మొత్తానికి చాలా తేడా ఉండటంతో ప్రస్తుతానికి ఓటీటీ చర్చలను పక్కన పెట్టారు. అంతర్జాతీయ స్టూడియోలతో జరిపిన చర్చలు కూడా ఫలించనప్పటికీ, మేకర్స్ ఎలాంటి ఆర్థిక ఒత్తిడిలో లేరు. మార్కెటింగ్ లో దిట్ట అయిన రాజమౌళి త్వరలోనే అన్ని డీల్స్ సెట్ చేస్తారనే పూర్తి ధీమాతో ఉన్న చిత్ర బృందం, పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి పెట్టింది. భారీ అంచనాల నడుమ రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది

# బాలయ్య-నాగార్జున.. ఈసారైనా ఆ ఫీట్ సాధిస్తారా..?




టాలీవుడ్‌లో స్టార్ హీరోల స్టామినాకు రూ.100 కోట్ల షేర్ మార్క్ ఒక బెంచ్‌మార్క్‌గా మారింది. ఇప్పటికే దాదాపు అందరూ టాప్ హీరోలు కనీసం ఒక్కసారైనా ఈ రికార్డును సాధించగా, సీనియర్ స్టార్స్‌లో నందమూరి బాలకృష్ణ, అక్కినేని నాగార్జున మాత్రమే ఇంకా ఈ మైలురాయిని చేరుకోవాల్సి ఉంది.బాలకృష్ణ తన నెక్స్ట్ చిత్రం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వస్తున్న చీదీఖ 111తో ఈ రూ.100 కోట్ల షేర్ మార్క్‌ను అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భారీ అంచనాలున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద క్లిక్ అయితే బాలయ్య ఖాతాలో మొదటి వంద కోట్ల షేర్ పడటం ఖాయం. మరోవైపు నాగార్జున కూడా తన ల్యాండ్‌మార్క్ చిత్రం కింగ్ 100 తో ఈ అరుదైన మైలురాయి పై కన్నేశాడు.ఈ క్రమంలో మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద సాధిస్తున్న ఊపు చూస్తుంటే, ఆయన మరో రెండు రోజుల్లోనే ఈ రూ.100 కోట్ల షేర్ క్లబ్‌లో చేరడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

# ట్రైలర్‌ని పొగిడేసి సినిమాని తిట్టేస్తే ఎలా ఆర్జీవీ?

ఆదిత్య ధర్ తెరకెక్కించిన –ధురంధర్– చిత్రాన్ని ఆకాశానికి ఎత్తేసిన వర్మ.. పేరు ప్రస్తావించకుండానే –టాక్సిక్– చిత్రంలోని మేకింగ్ శైలిని తీవ్రంగా తప్పుబట్టారు.



ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలి విమర్శలతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తారనే సంగతి తెలిసిందే. అతడికి ఆనందం కలిగినా చికాకు పుట్టినా ఆపలేము. తాజాగా అతడు యష్ నటించిన –టాక్సిక్– సినిమాను – దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ పనితీరును పరోక్షంగా టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆదిత్య ధర్ తెరకెక్కించిన –ధురంధర్– చిత్రాన్ని ఆకాశానికి ఎత్తేసిన వర్మ.. పేరు ప్రస్తావించకుండానే –టాక్సిక్– చిత్రంలోని మేకింగ్ శైలిని తీవ్రంగా తప్పుబట్టారు. –ధురంధర్– చిత్రంలో హీరో ఆరాధన కంటే పాత్రల సహజత్వానికి, కథా బలానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారని వర్మ కొనియాడారు. అయితే దీనికి విరుద్ధంగా కొన్ని చిత్రాల్లో (టాక్సిక్ ఉద్దేశించి) కథ కంటే స్టైల్, యాటిట్యూడ్‌కే ఎక్కువ పీపీ ఇస్తున్నారని విమర్శించారు. ఆ సినిమాల్లో పాత్రల అంతరంగం కంటే స్లో–మోషన్ షాట్లే ఎక్కువసేపు ఉంటాయని.. హింస అనేది కేవలం సందర్భం – భావోద్వేగం లేని దృశ్యంగా మాత్రమే మిగిలిపోతోందని వర్మ పెదవి విరిచారు. తన ఐకానిక్ చిత్రం సత్యను ఉదాహరణగా చూపిస్తూ.. ధురంధర్ సినిమాలో సహాయ నటుల పాత్రలను ఎంతో సహజంగా తీర్చిదిద్దారని కొనియాడారు. హీరో పాత్రను దేవుడిలా చూపెట్టకుండా.. సాధారణ వ్యక్తిలా నడవడికను వర్ణించడం కథకు బలాన్ని ఇచ్చిందన్నారు. కథ లేకుండా కేవలం హీరోయిజం, స్లో–మోషన్ షాట్లు, హంగులతో తీసే సినిమాలపై ఆర్జీవీ పరోక్ష విమర్శలు గుప్పించారు. ––కొన్ని సినిమాల్లో క్యారెక్టర్ల అంతరంగం కంటే స్లో–మోషన్ షాట్లే ఎక్కువసేపు ఉంటాయి. అక్కడ హింస అనేది ఎటువంటి సందర్భం లేని ఒక దృశ్య వినోదం మాత్రమే. ఎడిటింగ్ కూడా కథలో లేని కృత్రిమ తీవ్రతను తెచ్చేలా ఉంది–– అని వ్యాఖ్యానించారు.చాశ్రీంశీ =ఘు – ఎపిక్ రొమాంటిక్ సీన్స్.. ఆనంద్ దేవరకొండ పర్ఫెక్ట్ క్లారిటీ మొదట మార్చి నెలలో ధురంధర్ 2, టాక్సిక్ సినిమాలు ఒకేసారి విడుదల కావాల్సి ఉండగా.. టాక్సిక్ విడుదల వాయిదా పడి ఇటీవలే థియేటర్లలోకి వచ్చింది. విడుదలైన మొదటి 5 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 285 కోట్ల వసూళ్లు సాధించినా.. ఈ రెండు చిత్రాల మేకింగ్ శైలిపై పోలికలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు ఆర్జీవీ లాంటి సీనియర్ దర్శకుడు గీతూ మోహన్ సినిమాని విమర్శించడం చర్చగా మారింది. నిజానికి టాక్సిక్ టీజర్ ట్రైలర్ విడుదలైనప్పుడు గీతూ మోహన్ పనితనాన్ని ఆర్జీవీ పొగిడేసారు. కానీ ఇప్పుడు పూర్తి సినిమా విడుదలయ్యాక తన వెర్షన్ కూడా పూర్తిగా మారిపోవడం విశేషం.

# అన్నపూర్ణ స్టూడియోస్‌లో కాలేజీ విద్యార్థులతో దుల్కర్ గేమ్

వర్సటైల్ నటుడు దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటించిన –ఐమ్ గేమ్– చిత్రం ప్రీ–రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగింది. వర్సటైల్ నటుడు దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటించిన –ఐమ్ గేమ్– చిత్రం ప్రీ–రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దుల్కర్ వేదికపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. తాము నిర్మించిన ప్రాజెక్ట్‌లలో ఇది అత్యంత భారీ చిత్రమని.. ఓటీటీ సంస్థలతో మాట్లాడినప్పుడు కూడా ఇదొక పెద్ద స్ట్రెయిట్ తెలుగు సినిమా లాంటిదని గర్వంగా చెప్పానని ఆయన వెల్లడించారు. ట్రైలర్‌లో తాము అన్ని విషయాలను బయటపెట్టలేదని...సినిమాలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే అనేక అంశాలు దాగి ఉన్నాయని స్పష్టం చేశారు. తెలుగు ప్రేక్షకుల సినిమా ప్రేమాభిమానాల గురించి దుల్కర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వేదికపై ప్రభాస్, మహేష్ బాబు, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, నాగార్జున, చిరంజీవి వంటి ఏ కథానాయకుడి పేరు విన్నా అభిమానుల్లో కనిపించే ఉత్సాహం అద్భుతమని కొనియాడారు. తాను మలయాళం, తమిళం లేదా హిందీ భాషల్లో ఏ సినిమా తీసుకువచ్చినా.. తెలుగు ప్రేక్షకులు ఎల్లప్పుడూ తమ హృదయాల్లో స్థానం కల్పిస్తారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమా కోసం నేరుగా స్వయంగా తెలుగు డబ్బింగ్ చెప్పానని... దర్శకుడు నాగ్ అశ్విన్ (నాగి) కూడా సినిమా చూసి ఎడిటింగ్‌లో సహాయం అందించారని తెలిపారు. ఆనంద్ దేవరకొండ పర్ఫెక్ట్ క్లారిటీ తన కెరీర్‌లో –మహానటి– చిత్రం అత్యంత కీలకమైనదని దుల్కర్ గుర్తుచేసుకున్నారు. మొదట్లో తనకు తెలుగు రాదని.. ప్రేక్షకులు ఏమనుకుంటారో అని భయపడినప్పుడు నాగ్ అశ్విన్, స్వప్న దత్ దంపతులు తనకు ధైర్యం చెప్పి తెలుగు నేర్పించారని వివరించారు. నేడు తాను తెలుగులో ఈ స్థాయిలో నిలబడటానికి వైజయంతీ మూవీస్ బృందమే ముఖ్య కారణమని... హైదరాబాద్‌లో వారిని తన సొంత కుటుంబంగా భావిస్తానని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ చిత్రం తర్వాత తన నుంచి వెంటనే రెండు స్ట్రెయిట్ తెలుగు సినిమాలు రాబోతున్నాయని ప్రకటించి అభిమానులకు తీపి కబురు అందించారు. ఈవెంట్లో భాగంగా జరిగిన సరదా ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో తన వ్యక్తిగత అభిరుచులను షేర్ చేసారు. తన తండ్రి (మమ్ముట్టి) నటించిన సినిమాల్లో –దళపతి– తనకి అత్యంత ఇష్టమైన చిత్రమని వెల్లడించారు. విద్యార్థిగా కాలేజీ రోజులకు వెళ్లేటప్పుడు తన వెంట తీసుకెళ్లిన ఏకైక డివిడి –దళపతి– మాత్రమే అని, తండ్రి జ్ఞాపకాలు గుర్తొచ్చినప్పుడల్లా ఆ సినిమానే చూసేవాడినని తెలిపారు. ఇక తనకు అత్యంత ఇష్టమైన ఆహారం ఏదనే ప్రశ్నకు స్పందిస్తూ.. హైదరాబాద్ బిర్యానీ అంటే తనకు ప్రాణమని.. తాను గొప్ప బిర్యానీ ప్రేమికుడిని అని చమత్కరించారు. –ఐమ్ గేమ్–చిత్రం సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రాబోతుందని. ఈ సినిమా ఖచ్చితంగా అందరినీ అలరిస్తుందనే ధీమాను దుల్కర్ వ్యక్తం చేశారు. చిత్రంలో భాగమైన ఇతర నటీనటులను కూడా ప్రేక్షకులకు పరిచయం చేస్తూ.. ఈ ఈవెంట్‌ను విజయవంతం చేసిన అభిమానులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197